
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 30 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 25.8

ఏం జరిగింది...

యాదాద్రి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజీవ్స్‌లో రాకెట్ లాంచ్ ప్రొఫలెంట్ తయారీ సందర్భంగా పేలుడు సంభవించింది.

ప్రమాదం...

సాయంత్రం 4.45 నిమిషాలకు భారీ పేలుడు ప్రభావం చుట్టు పక్కల ఆరు కిలోమీటర్ల వరకు కనిపించింది.

మృతులు : ఒకరు

శకలాల కింద ఉన్నవారు : ఇద్దరు

గాయపడిన వారు : ఆరుగురు



గాయపడిన ఓ కార్మికుడు



పేలుడు ధాటికి పూర్తిగా ధ్వంసమైన భవనం

కదిలిస్తే కన్నీళ్లే

- విధులు ముగించుకొని వెళ్లే సమయంలో ప్రమాదం
- ప్రొఫలెంట్ పేలుడుతో భారీ ప్రమాదం
- ఘటనలో ఒకరు మృతి.. ఇద్దరు గల్లంతు.. ఆరుగురికి తీవ్రగాయాలు
- మోటకొండూరు మండలం కాటేపల్లిలో ఘటన

వారివి రెక్కాడితేగాని.. డొక్కాడని కుటుంబా లు. పొద్దస్తమానం కష్టపడితే తప్ప కుటుంబాలను పోషించుకోలేని దీనస్థితి. ఉదయం ఆరు గంటలకు విధుల్లో చేరిన వారు ఇంకో పావుగంటలో ఇంటికి వెళ్తారనుకునే సమయానికి ఒక్కసారికి విధి వక్రించింది. అప్పటిదాకా అంతా పనిచేసిన బ్లాక్‌లో భారీ పేలుడు సంభవించి కొందరి శరీరాలు చెల్లాచెదురు కాగా, శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇంకొందరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రులకు తరలించారు. మంగళవారం ఈ ఘటన మోటకొండూరు మండలం కాటేపల్లిలో ని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో జరిగింది. ఈ పేలుడు ధాటికి రెండు కిలోమీటర్ల వరకు భూమి కంపించినట్లయిందని స్థానికులు పేర్కొన్నారు. శకలాల కింద మరింత పేలుడు పదార్థం ఉండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోననే భయానక వాతావరణంలో అంతా బిక్కుబిక్కుమంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మోటకొండూరు)

●6లో..



రోదిస్తున్న కార్మికుడి కుటుంబ సభ్యులు

మిన్నంటిన ఆర్తనాదాలు

మోటకొండూరు మండలం కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో శకలాల కింద గల్లంతైన వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల సందీప్ (30) సంవత్సరం క్రితం వివాహమైంది. అతని భార్య నిఖిత ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. మరో వారం రోజుల్లో తన భార్యకు సీమంతం చేద్దామనుకున్నాడు. కానీ అంతలోనే జరిగిన పేలుడు ప్రమాదంలో శకలాల కింద చిక్కుకోవడంతో అతని కుటుంబసభ్యులు కంపెనీ వద్ద రోదిస్తున్న తీరు అక్కడి వారిని కలచి వేసింది.

భూ సమస్యల పరిష్కారానికే

‘భూ భారతి’

కలెక్టర్ ఇలా త్రిపాఠి



భూ భారతి చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

(ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం): భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. భూభారతి చట్టంలో భాగంగా రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే గ్రామాలకు వస్తారని అన్నారు. భూసమస్యలు 80 శాతం తహసీల్దార్ స్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. ఎమ్మెల్యే మందుల సామేలు,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, భూభారతిని చట్టాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పి.యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, డీటీ వరప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్,ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపైకి వెళ్తున్న రైతును అడ్డుకున్న ఎస్ఐ

భూభారతి అవగాహన సదస్సులో గందరగోళం నెలకొంది. సమస్యను విన్నవించడానికి వచ్చిన రైతును ఎస్ఐ నెట్టివేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సదస్సులో నూలగడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన సంకటి పోతరాజు అనే రైతు తన సమస్యను చెప్పే అవకాశం రాలేదని కొంత హడావుడి చేయడంతో పాటు గొడవ చేశాడు. తాను వేదికపైకి వెళ్లి ఎంపీ, ఎమ్మెల్యేతో మాట్లాడతానని ఎస్ఐతో చెప్పడంతో ఆయన నిరాకరించారు. అతను వేదిక పైకి వెళ్తుండగా ఎస్ఐ సైదులు, పోలీసులు అడ్డుకున్నారు. అయినా పోతరాజు, అతని అల్లుడు సింగరి శ్రీనివాస్ వేదికపై ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా ఎస్ఐ సైదులు తోసివేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడే ఉన్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు రైతులు, పోలీసులను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

రికార్డులు సరిగా లేకుంటే చర్యలు

పెద్దవూర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు, లింగంపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, చెల్లింపుల వివరాలను పీఏసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవోపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



బకాయిలు ఎప్పుడిచ్చేనో?

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏళ్లుగా విడుదల చేయకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలు నిర్వహించడంతోపాటు ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరించాయి. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా, బకాయిలు అందకపోవడంతో అటు యాజమాన్యాలు, పరీక్షలు నిలిచిపోవడంతో ఇటు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

- డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.160కోట్లు
- ఉపముఖ్యమంత్రిని కలిసి విన్నవించినా పరిష్కారానికి నోచని సమస్య
- ఇప్పటికే రెండుసార్లు కళాశాలల బంద్
- ప్రాక్టికల్స్ బహిష్కరణ, పరీక్షలకు దూరం

ఎంజీ యూనివర్సిటీ పరిధిలో 62 డిగ్రీ కళాశాలలు ఉండగా, అందులో 12 ప్రభుత్వ, 50 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ముగిసింది. ఇప్పటికే కళాశాలలకు గత నాలుగేళ్లుగా సుమారు రూ.100కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉండగా, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మరో రూ.60కోట్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. పాత బకాయిలకు సంబంధించి 2023 డిసెంబరులో ట్రెజరీశాఖ టోకెన్లు జారీ చేయగా, ఈ-కుబేర్‌లో ఉన్నాయి. ఈ బకాయిలు నేటికీ అందకపోవడంతో కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బకాయిలు విడుదల కోసం పలుమార్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి విన్నవించగా, చెల్లింపులపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. దీంతో చేసేదిలేక యాజమాన్యాలు ఇప్పటికే రెండుసార్లు కళాశాలల బంద్ నిర్వహించడంతోపాటు ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలను బహిష్కరించాయి. అయినా విద్యాశాఖ మంత్రి అయిన సీఎం..

- మిగతా 7వ పేజీలో..

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినా

ఉమ్మడి జిల్లాలో 62 డిగ్రీ కళాశాలలు ఉండగా, వాటిలో 50 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలు సుమారు రూ.100కోట్లు రావాల్సి ఉంది. తాజాగా ముగిసిన విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.60కోట్ల బకాయిలు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తంగా రూ.160కోట్ల బకాయిలు ఉండగా, వీటిని చెల్లించాలని గత ఏడాది అక్టోబరులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కళాశాలల యజమానులు కలిసి విన్నవించారు. దీంతో గత ఏడాది నవంబరులోనే వాటిని చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తిరిగి నవంబరులో డిప్యూటీ సీఎంను యజమానులు కలవగా, డిసెంబరులో చెల్లించేందుకు హామీ ఇచ్చారు.

డిసెంబరులో కలవగా, ఈ ఏడాది జనవరిలో చెల్లిస్తామని చెప్పారని, అయినా నేటికీ బకాయిలు విడుదల చేయలేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా బకాయిలు అందలేదని దీంతో కళాశాలల బంద్ చేపట్టడంతోపాటు, ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు దూరంగా ఉన్నామని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. అయినా ప్రభుత్వంలో చలనం లేదని వాపోతున్నాయి.

వెంటనే బకాయిలు చెల్లించాలి



దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

దేవరకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.4500కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్య వసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు కంభాలపల్లి ఆనంద్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, బీసీ సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, ఆంజనేయులు, మోతిలాల్, గణేష్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయశాఖలో బదిలీలు, పదోన్నతులు

జేడీఏగా గీత నియామకం

నల్లగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయశాఖలో పలువురు అధికారులను బదిలీ, పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (జేడీఏ)గా రాష్ట్ర కమిషనరేట్‌లో డీడీఏ(డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)గా పనిచేస్తున్న ఎస్.గీతను నియమించారు. అదేవిధంగా ఆత్మ కార్యాలయంలో డీడీఏగా పనిచేస్తున్న సుదర్శనికి జేడీఏగా పదోన్నతి కల్పించి ఆత్మ ప్రాజెక్టులోనే నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. హాలియా ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)గా పనిచేస్తున్న వెంకట్‌రవీంద్రకు డీడీఏగా పదోన్నతి కల్పించి వికారాబాద్ ఆత్మ డీపీడీఏ (డిస్ట్రిక్ ప్రోగ్రాం డైరెక్టర్)గా బదిలీ చేశారు. మిర్యాలగూడ ఏడీఏగా పనిచేస్తున్న దేవ్‌సింగ్‌కు డీడీఏగా పదోన్నతి కల్పించి యాదాద్రి జిల్లా ఆత్మ డీపీడీగా నియమించారు. నల్లగొండ రైతు శిక్షణ కేంద్రంలో ఏడీఏగా పనిచేస్తున్న వీరప్పకు డీడీఏగా పదోన్నతి కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం ఆత్మ డీపీడీగా బదిలీ చేశారు. నకిరేకల్ ఏడీఏగా పనిచేస్తున్న అనితకు డీడీఏగా పదోన్నతి కల్పించారు.

‘ప్రజావాణి’ దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్



ఫిర్యాదులు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’లో 33 మంది ఫిర్యాదులు అందజేశారు. అందులో అత్యధికంగా 14 రెవెన్యూశాఖకు చెందినవి, 19 వివిధ శాఖాలకు చెందిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాఖల వారీగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యమండలి నిబంధనలు పాటించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



మిర్యాలగూడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వసతులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైద్యమండలి సూచించిన నిబంధనలను ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు కచ్చితంగా పాటించాలని డీఎంహెచ్‌వో వి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన తనిఖీచేశారు. ఆస్పత్రి అనుమతి పత్రాలతోపాటు ఫైర్‌సేఫ్టీ, ఫీజుల పట్టిక, వైద్యుల విద్యార్హత సూచిక బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్స్ కాలనీలో ఏడు ఆస్పత్రుల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు వైద్యమండలి నిబంధనలను ఉల్లంఘించడంతో నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన రేడియాలజిస్టు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే గుర్తించి నోటీసులు ఇస్తామని, నిబంధనలకు విరుద్ధంగా నడిచే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పీవో డాక్టర్ అరుంధతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, సీహెచ్‌వో నర్సింహ, మోతీలాల్, ప్రభాకర్, రమేష్, తదితరులు ఉన్నారు.కాగా, ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యాధికారులు గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు పూర్తిచేశారని, నిబంధనల ఉల్లంఘనతో పాటు ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకున్నా చూసీచూడనట్లు వదిలేసి నోటీసులతో సరిపెట్టారనే చర్చ స్థానికంగా సాగుతోంది. తనిఖీల విషయం తెలుసుకున్న మీడియా అక్కడకు వెళ్లగా, డీఎంహెచ్‌వో ఎలాంటి ప్రకటన చేయకుండానే వెళ్లిపోయారు. ఉమ్మడి జిల్లాలోనే ప్రైవేట్ ఆస్పత్రులు అత్యధికంగా ఉన్న మిర్యాలగూడలో నామమాత్రపు తనిఖీలు చేపట్టి వదిలేస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వేను పూర్తి చేయాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేయాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ, మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ రికార్డుల నిర్వహణ సమర్థంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, సూపరింటెండెంట్ సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

విలీన ప్రాంతాలకు మహర్దశ

- రూ. 53 కోట్లతో సీసీరోడ్లు, ఓపెన్ డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి
- ఇప్పటికే 60శాతంకు పైగా
- నల్లగొండ మునిసిపాలిటీపై దృష్టి సారించిన మంత్రి కోమటిరెడ్డి

●8లో..

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే చస్తాం

● చండూరులో మహిళ నిరసన

●6లో..

బంగారం.. పిరం

▸▸ 15 సంవత్సరాలుగా పసిడి ధరలు పైపైకి ▸▸ నేడు అక్షయ తృతీయ



15 ఏళ్లుగా బంగారం ధరలు	
2010	రూ.15,620
2011	రూ.22,650
2012	రూ.29,150
2013	రూ.28,000
2014	రూ.30,800
2015	రూ.27,300
2016	రూ.30,000
2017	రూ.29,300
2018	రూ.32.200
2019	రూ.35,100
2020	రూ.48.500
2021	రూ.49.000
2022	రూ.52.500
2023	రూ.58,100
2024	రూ.65,000
2025	రూ.98,500

(ఆంధ్రజ్యోతి - నిడమనూరు): నేడు అక్షయ తృతీయ. మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైన పర్వదినం. బుధవారం అక్షయ తృతీయను ఘనంగా జరుపుకునేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నా బంగారం ధరలు భయపెడుతున్నాయి. అక్షయం అంటే మంచి అని, నాశనం కానిదనే అర్థాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తది య, రోహిణి నక్షత్రం రోజున ఈ వేడుకను నిర్వహిస్తారు. మరణించిన కుటుంబ పెద్దలకు దీపారాధన సైతం గావిస్తారు. ఎవరి శక్తి మేర వారు వారికి తోచిన దానిని ప్రజలకు దానం చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు శ్రీకృష్ణుడు, గౌరీదేవిని ఉయ్యాలలపై కూరోబెట్టి వారికి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. దీంతో ఎల్లప్పుడు వారి కుటుంబంలో మంచి జరుగుతుందనేది ప్రజల నమ్మకం. అక్షయ తృతీయ రోజున ప్రజలు వారి శక్తిమేర బంగారాన్ని కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున బంగారం కొనుగోలు చేస్తే లక్ష్మీదేవిని ఇంటికి ఆహ్వానించడమేనని అంటారు. బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కొనుగోలు చేసేందుకు మహిళలను భయపెడుతున్నాయి. కనీసం ఒక గ్రాము బంగారం కొనుగోలు చేయాలన్నా రూ.10 వేలకు పైగా పెట్టాల్సిందే. ప్రస్తుతం మార్కెట్లో పసిడి ధర పది గ్రాములకు రూ.98,500 వరకు ఉంది. గత ఏడాదితో పోల్చితే బంగారం ధర ఈ ఏడాది భారీగా పెరిగింది.

జాగ్రత్తలు పాటించాలి...

బంగారం కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. ఆభరణాలు, బిస్కెట్ బంగారం కొనుగోలు చేసే ముందు బరువు(తూకం) ఒకటికి రెండు సార్లు సరిగా చూసుకోవాలి. రెడీమేడ్ నగలు కొనాలనుకుంటే కేడీఎం, హాల్మార్క్ వంటి ముద్రలున్న వాటిని ఎంచుకోవాలి.

శుభం జరుగుతుందని బంగారం కొంటారు

అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే శుభం జరుగుతుందని ప్రజల విశ్వాసం. దీంతో పండుగ రోజున తప్పనిసరిగా ఎంతో కొంత కొనుగోలు చేస్తారు. పలు రకాల డిజైన్లు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. కానీ పెరిగిన ధరలతో ఇబ్బంది ఉంది.బంగారం కొనుగోలు చేసే పరిస్థితులు తక్కువగా ఉన్నాయి.

- విశ్వనాథుల రమేష్, బంగారం దుకాణం, నిడమనూరు.

కదిలిస్తే కన్నీళ్లే..



కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మోటకొండూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వారంతా రెక్కాడితేగాని.. డొక్కాడని కుటుంబాలకు చెందినవారు. పొద్దస్తమానం కష్టపడితే తప్ప కుటుంబాలను పోషించుకోలేని దీనస్థితి. ఉదయం ఆరు గంటలకు విధుల్లో చేరిన వారు ఇంకో పావుగంటలో ఇంటికి వెళ్తారనుకునే సమయానికి ఒక్కసారిగా విధి వక్రించింది. అప్పటిదాకా అంతా కలిసి పనిచేసిన బ్లాక్‌లో భారీ పేలుడు సంభవించి కొందరి శరీరాలు చెల్లాచెదురు కాగా, మరికొందరు శకలాల కింద చిక్కుకున్నారు. ఇంకొందరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రులకు తరలించారు. మంగళవారం ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలో ని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో జరిగింది. ఈ పేలుడు ధాటికి రెండు కిలోమీటర్ల వరకు భూమి కంపించనట్లయిందని స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కంపెనీలోని సెక్షన్ 18ఏ భవనంలో శ్రీహరికోట రాకెట్ లాంచ్ వెహికిల్‌లో వినియోగించే ప్రొఫెలెంట్ మిక్సింగ్ చేస్తున్న సమయంలో మంగళవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో భవనం పూర్తిగా కుప్పకూలిపోయింది. అదే సమయంలో అక్కడ ఏడుగురు కూలీలు విధులు నిర్వర్తిస్తున్నారు. పేలుడు ధాటికి పక్కన ఉన్న భవనాలు పగుల్లు పడడంతోపాటు శకలాలకింద మాంసపు ముద్దలు పడిఉన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో మండల కేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్(22), కాటేపల్లికి చెందిన గునుకుంట్ల సందీప్(30) ఉన్నారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కాల్వల నరేష్(33) తీవ్రంగా గాయపడగా, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురు క్షతగాత్రులు వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన బుగ్గ లింగస్వామి, చాడ గ్రామానికి చెందిన రాజబోయిన శ్రీకాంత్, యాదగిరిగుట్ట మండలం కాచారంనకు చెందిన బర్ల శ్రీకాంత్, పెద్దకందుకూరు గ్రామానికి చెందిన సంద మహేందర్, మోటకొండూరు మండలం బెజ్జెంకిబావికి చెందిన సలేంద్ర మహేష్, భువనగిరి మండలం అనాజిపూరం గ్రామానికి చెందిన ఎన్.మహేష్‌కు తీవ్రగాయాలు కాగా భువనగిరిలోని ప్రైవేట్ అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు.

కన్నీరే మిగిలింది..

కాటేపల్లి ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తితోపాటు గాయపడిన, శకలాల కింద చిక్కుకున్న వారిపైనే ఆయా కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రమాదంలో మృతి చెందిన నరేష్‌కు ఏడాది క్రితం వివాహం కాగా, అతని భార్య గర్భిణి. సీమంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, అనుకోకుండా జరిగిన ప్రమాదంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. అదే విధంగా కాటేపల్లికి చెందిన సందీప్ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ఇతనిపైనే ఉంది. మోటకొండూరుకు చెందిన దేవి చరణ్ చిన్నతనంలోనే తండ్రి వదిలేయడంతో తల్లి పెంచింది. అయితే శకలాల కింద చిక్కుకున్న వారు ఇంకా బతికే ఉంటారన్న ఆశతో ఆ కుటుంబ సభ్యులు ఘటనాస్థలంలో ఎదురు చూస్తున్నారు. క్షణక్షణం ఉత్కంఠతో రోదిస్తూ కన్పించారు. అదే విధంగా రోజూ ఇంటికొచ్చే వారు, కంపెనీలో పనిచేసుకొని అటునుంచి అటే ఆస్పత్రుల పాలు కావడంతో క్షతగాత్రుల కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు రోదిస్తూ పెరుగెత్తడంతో ఆయా గ్రామాల్లో విషాధచాయలు అలముకున్నాయి.

భారీ శబ్దానికి ఉలిక్కిపడిన ప్రజలు

మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలో జరిగిన భారీ పేలుడుతో సెక్షన్ 18ఏ భవనం పూర్తిగా కుప్పకులిపోగా, దట్టమైన పొగతో కూడిన భారీ శబ్దానికి దాదాపు ఆరు కిలోమీటర్ల మేర శబ్ధం రావడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు భయందోళనకు గురయ్యారు. దీంతో ఏం జరిగిందో అర్థంకాక ప్రజలు రోడ్లపైకి వచ్చారు.

గ్రామస్థుల ఆందోళన

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ఎదుట, రాయిగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఘటనా స్థలానికి చేరుకోగా అందోళనకారులు ఆయనను చుట్టుముట్టారు. దీంతో ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ ఉమేష్ యదవ్ అందోళనకారులకు నచ్చజెప్పడంతో అందోళన విరమించారు.

గాయపడిన కార్మికులు హైదరాబాద్‌కు తరలింపు

భువనగిరి టౌన్: మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ పేలుళ్లలో గాయపడిన కార్మికులను హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. పేలుడు జరిగిన వెంటనే భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి నలుగురు కార్మికులను జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆ నలుగురని, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి, మరో ముగ్గురు కార్మికులను వేర్వేరు అంబులెన్స్‌లలో హైదరాబాద్‌లోని వేర్వేరు ఆసుపత్రులకు పంపారు. తరలించిన కార్మికుల్లో రాజబోయిన శ్రీకాంత్ (చాడ), బుగ్గ లింగస్వామి (పులిగిల్ల), నరేష్ (ఆత్మకూరు(ఎం)), మహేందర్ (కందుకూరు), బర్ల శ్రీకాంత్ (కాచారం), నల్ల మహేష్ (అనాజిపురం)తోపాటు మరో కార్మికుడు ఉన్నారు. అయితే బాధితులను చూసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన బంధుమిత్రుల రోదనలతో ఆసుప్రతుల్లో విషాధచాయలు అలముకున్నాయి. ఆస్పత్రుల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది, ధ్వంసమైన భవనం

వరుస పేలుళ్లతో ప్రజల్లో ఆందోళన



పెద్దకందుకూర్ ప్రీమియర్ కంపెనీ

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలలో వరుస పేల్లుళతో కార్మికులు బెంబేలెత్తుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పెద్ద కందుకూర్ గ్రామంలో 2025 జనవరి 4వ తేదీన జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురు గాయపడిన ఘటన జరిగి నాలుగు నెలలు గడువక ముందే అదే కంపెనీకి సంబంధించి, తాజాగా కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనకు కారణం యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కంపెనీల్లో పనిచేసే కార్మికులకు ప్రొడక్షన్‌పై సరైన అవగాహన లేకపోవడం, కార్మికులకు వాటిపై శిక్షణ ఇవ్వకపోవడంతో ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూర్ కంపె నీ 1985లో స్థాపించారు. కంపెనీలో అప్పటి నుంచి నేటి వర కు వరుసగా 2011లో పేలుడు జరిగినప్పుడు ఇద్దరు, 2019లో ఒకరు, 2025 లో మరో కార్మికుడు ఇప్పటివరకు నలుగురు మృత్యువాత పడ్డారు. వరుస పేలుళ్లతో కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా కంపెనీ యాజమాన్యంపై ఆయా శాఖలకు చెందిన అధి కారులు చర్యలు తీసుకున్న ఘటనలు లేకపోలేదు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే చస్తాం

● చండూరులో మహిళ నిరసన ● తుంగతుర్తిలో వాటర్‌ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్ ● ఉమ్మడి జిల్లాలో ఘటనలు

తుంగతుర్తి, చండూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే ఎమ్మెల్యే ఇంటి ముందే చస్తానని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేయగా, మరొకరు ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశారు. మంగళవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఈ ఘటనలు జరిగాయి. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని నల్లగొండ జిల్లా చండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసనలో పాల్గొన్న చండూరు మండలం నెర్మట గ్రామానికి చెందిన పాలడుగు ముత్తమ్మ మాట్లాడుతూ భర్త మృతితో 20 ఏళ్లుగా నెర్మట గ్రామంలోని తల్లిగారింటి వద్ద ఉంటూ కూలి పనిచేసుకొని బతుకుతున్నామని, తమకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలన్నారు. "ప్రభుత్వం ఏమి లేనోళ్లకు ఇళ్లు ఇయ్యమంటే భూములు, ఇళ్ళు ఉన్నోళ్లకే ఇస్తున్నారని, వాళ్ళు ఓటు వేస్తేనే గెలిచిండా ఈ ఎమ్మెల్యే.. మేము ఓటు వేయలేదా, ఇల్లు, భూమి ఏమి లేని నాకు ఇల్లు రాకపోతే పోయి ఆ ఎమ్మెల్యే ఇంటి ముందే చస్తా" అని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన భయ్య కనకయ్య జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఇంటికోసం గ్రామానికి వచ్చి దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల అధికారులు విడుదల చేసిన మొదటి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు రాలేదని ఉదయం 11 గంటల సమయంలో వాటర్ ట్యాంక్ ఎక్కాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్ఐ రుద్ర క్రాంతికుమార్ సం ఘటనాస్థలానికి చేరుకొని బాధితుడికి నచ్చజెప్పి కిందికి దింపారు.



చండూరులో నిరసన తెలుపుతున్న మహిళ



తుంగతుర్తిలో వాటర్ ట్యాంక్ ఎక్కిన వ్యక్తి

ఖబరస్తాన్‌లో బయటపడిన పురాతన రాగి పత్రాలు

● మృతదేహాన్ని పూడ్చేందుకు గుంత తవ్వుతుండగా లభ్యం ● సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఘటన

కోదాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఖబరస్తాన్(శ్మశానవాటిక)లో గుంత తవ్వుతుండగా మట్టి కుండలో రాగి పత్రాలు లభ్యమయ్యాయి. మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. కోదాడలో ఓ వ్యక్తి మృతదేహాన్ని పూడ్చేందుకు ముస్లిం శ్మశాన వాటికలో గుంత తవ్వారు. ఓ మట్టికుండ కనిపించడంతో వక్ఫ్ బోర్డు సభ్యుడు జబ్బార్ ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ ఆదేశాల మేరకు ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వాహిద్‌లు శ్మశాన వాటికకు చేరుకుని మట్టికుండను పంచనామా చేశారు. మట్టి కుండలో తొమ్మిది కడియాలకు బిగించిన రాగి పత్రాలు ఉండగా, వాటిపై తమిళం, సంస్కృతంలో రాసిన పదాలను గుర్తించారు. రాగి పత్రాలకు సంబంధించిన సమాచారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, మట్టి కుండలో లభించిన రాగి పత్రాలను పురావస్తు శాఖకు అందిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వాహిద్‌లు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా కోదాడలో బయటపడిన రాగి పత్రాలు

పంచాయతీ కార్యదర్శిపై దాడి

● అధికార పార్టీకి చెందిన యువకుడి బెదిరింపు

● ఇందిరమ్మ ఇళ్ల జాబితా విచారణ సమయంలో వాగ్వాదం

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై విచారణ చేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై ఓ యువకుడు దాడిచేశాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం దీరావత్‌తండాలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై దీరావత్‌తండాలో పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్ సోమవారం విచారణ చేస్తున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు అడ్డగించి వాగ్వాదానికి దిగాడు. అధికార పార్టీకి చెందిన తనకు సమాచారం ఇవ్వకుండా గ్రామంలో విచారణ ఎలా చేపడతారంటూ బెదిరించడంతోపాటు చెయ్యి చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగరాజుపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

బస్సు ఢీకొని మూడు పాడిగేదెలు మృతి

నేరేడుచర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మూడు గేదెలు మృతి చెందాయి. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... కొత్తగూడెం నుంచి బెంగళూరుకు వెళ్తున్న శ్రీతులసి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొనడంతో నేరేడుచర్ల పట్టణ పరిధిలోని నర్సయ్యగూడెంలోని మన్నెం వెంకన్నకు చెందిన మూడు పాడిగేదెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నేరేడుచర్ల మండలం రామగిరి వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంకు గేదె ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం దామెరచర్ల మండలంల యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో డీఈగా పనిచేస్తున్న ఖమ్మంకు చెందిన ధరావత్ రమేష్ ఖమ్మం నుంచి దామెరచర్లకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రామగిరి వద్ద గేదె ఢీకొన్నట్లు తెలిపారు. వెంటనే 108లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరిస్థితి విషమయంగా ఉండడంతో మిర్యాలగూడలోని అపోలో ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 29,(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో జైలు శిక్ష, జరిమానా విధించింది. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 28వ తేదీన సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఎదుట హాజరుపర్చగా ఒకరికి ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా, మిగిలిన ముగ్గురికి కలిపి రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చెరువులో విష ప్రయోగం.. చేపలు మృత్యువాత

హాలియా, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో విష ప్రయోగం చేయడంతో చేపలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అనుముల మండలం కొత్తల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చినకుంట చెరువులో మంగళవారం జరిగింది. గతేడాది ఈ చెరువును మత్స్యకార సంఘం లీజుకు తీసుకొని చేపల పెంపకం చేపట్టింది. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతో చెరువులో ఉన్న ఐదు క్వింటాళ్ల చేపలు మృతిచెందినట్లు చైర్మన్ నాశనబోయిన వెంకటయ్య, ఉపసర్పంచ్ మేకల లింగయ్య తెలిపారు. చెరువులో విషప్రయోగం చేసిన వారిని గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు తమకు ప్రభుత్వం నుంచి సహకారం అందించి ఆదుకోవాలని మత్స్యకా సంఘం నాయకులు కోరారు.



విషప్రయోగంతో మృతిచెందిన చేపలు

ఆర్చి వివాదం.. పరిష్కరించిన పోలీసులు

మఠంపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారమే పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమ ఉద్దేశమని హుజూర్‌నగర్ సీఐ గజ్జెల చరమందరాజు అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని అల్లీపురం గ్రామంలో రెండు సంవత్సరాలుగా ఆర్చి నిర్మాణ వివాదం నెలకొంది. ఈ సమస్యను మంగళవారం గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమం ద్వారా సీఐ పరిష్కరించారు. అల్లీపురం, అంజలిపురం గ్రామాల మధ్య ఆర్చి నిర్మించాలని జరుగుతున్న వివాదాన్ని ఇరు గ్రామాల ప్రజలతో, నాయకులతో మాట్లాడి అందరినీ సమన్వయపరిచి ఆర్చి నిర్మించే స్థలాన్ని అందరి అనుమతితో గుర్తించి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.బాబు, ఎంపీడీవో జగదీష్‌కుమార్ ఉన్నారు.

గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో నడవాలని గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్‌ల జోలికి వెళ్లకుండా వాటికి దూరంగా ఉండాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడులో మల్లం యాదయ్య 29వ వర్ధంతి సందర్భంగా మంగళవారం డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. యువత విద్యపై దృష్టి సారించాలని విద్యతోనే భవిష్యత్‌కు పునాది అని ఉన్నత విద్యనభ్యసించి సన్మార్గంలో పయనిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఆధునిక సమాజంలో నేటి యువత ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఉందన్నారు. యువత మత్తుకు అలవాటుపడి మద్యం, గంజాయి, డ్రగ్స్‌తో పాటుగా త్వరగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, వడ్డగాని మహేష్, కూనూరు గణేష్, దేశబోయిన నర్సింహ, అరూరి నర్సింహ, ఆడెపు రమేష్, గోలి సాయికిరణ్, అరూరి పవన్, మేడి మనోజ్ పాల్గొన్నారు.

మా భూమి మాకు ఇప్పించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేస్తున్న బాధితులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైన భూమిని తమకు అప్పగించాలని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం పెట్రోల్ బాటిళ్లతో నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. బాధితుడు రాపిడి గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం... గోపలాయపల్లికి చెందిన 550 సర్వే నంబరలో 30 గుంటల లావుని పట్టాభూమిని సమీపంలోని ఓ కంపెనీ కబ్జా చేసి అందులో నిర్మాణాలు చేపట్టిందని బాధితుడు తెలిపాడు. మా భూమిని మాకు అప్పగించకుంటే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు తలెత్తాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు కలెక్టర్ ఆదేశాలు పాటించి అక్రమ నిర్మాణాలు త్వరితగతిన తిలగించేందుకు చర్యలు తీసుకోవాలని తమ భూమిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థుల సమక్షంలో భూమికిరువైపులా ఉన్న రైతులను విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. పెట్రోల్ బాటిళ్ళతో రైతులు ఆందోళన చేస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న ఎస్ఐ క్రాంతి కుమార్ రైతులను తహసీల్దార్‌తో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో రాముడు గోపాల్‌రెడ్డి, అల్లె పరమేష్, కొప్పు గోపాల్, కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, కొమరెల్లి కృష్ణారెడ్డి, చలమారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మి, జ్యోతి, రామచంద్రారెడ్డి, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాపిడి గోపాల్ పేరిట 15గుంటలు మాత్రమే ఉందని, మిగతా 15గుంటల భూమి రికార్డుల్లో లేదన్నారు. సర్వే చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. కంపెనీలు చేపట్టిన నిర్మాణాలను స్వాధీనం చేసుకున్నామని, వాటిని తొలగించేందుకు భారీ యంత్రాలు అందుబాటులో లేవన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వేణుగోపాల్‌రెడ్డి(ఫైల్)

వేములపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లిలోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణం తాళ్లగడ్డకు చెందిన మందడి వేణుగోపాల్‌రెడ్డి(47) బైక్‌పై మంగళవారం ఉదయం నల్లగొండ సమీపంలోని మర్రిగూడలోని తమ బంధువు ఇంటికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ద్విచక్రవాహనంపై మిర్యాలగూడలోని తన ఇంటికి వస్తున్న క్రమంలో వేములపల్లి మండలకేంద్రానికి చేరుకున్నాడు. ఇదే సమయంలో జిల్లా పరిషత్ పాఠశాల పక్క సందు నుంచి వచ్చిన స్కార్పియో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వేణుగోపాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు.

మండుతున్న ఎండలు..

ముందు జాగ్రత్తే మందు

● ఉమ్మడి జిల్లాలో నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రత ● పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం ● వాహనాలు, మొక్కల సంరక్షణ కీలకమే... ● మూగజీవాలపై ప్రత్యేక జాగ్రత్తలు



"ఉదయం ఏడు గంటలు దాటితే సూర్య ప్రతాపం మొదలవుతోంది. ఆ తర్వాత గంటగంటకూ ఉష్ణోగ్రత పెరుగుతూ మధ్యాహ్నం పతాక స్థాయికి చేరుతోంది. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతుండటంతో జనం బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ పరిస్థితి మే నెలకల్లా మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మండుతున్న ఎండలకు పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాక మూగజీవాలు, మొక్కలను కాపాడుకోకపోతే ఎండాకాలం ముగిసేలేగా అవి దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ మేరకు వివిధ వర్గాల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెంపుడు జంతువులు, ఇళ్లల్లో పెంచుకునే మొక్కల సంరక్షణపై నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలతో ప్రత్యేక కథనం"

● భూదాన్‌పోచంపల్లి (ఆంధ్రజ్యోతి)

నానాటికీ పెరిగిపోతున్న ఎండల తీవ్రతతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండ ప్రభావంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక వేడితో పాటు చెమట కారణంగా ఒంట్లో నీటి శాతం తగ్గి, లవణాలు బయటకు వెళ్తాయి. ఫలితంగా డీహైడ్రేషన్‌కు గురై తలనొప్పి, స్పృహ కోల్పోవడం, మాట తడబడటం, వికారం, అలసట, కళ్లు తిరగడం, రక్తపోటు సమస్యలు తలెత్తుతాయి. మండే ఎండలకు తలెత్తుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రముఖ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఎస్.రామచంద్రయ్య వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



డాక్టర్ రామచంద్రయ్య

ఎండలతో ప్రజలకు ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించేందుకు పలు జాగ్రత్తలు ముందస్తుగా తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అధిక వేడితో చెమట కారణంగా ఒంట్లోని నీటి శాతం తగ్గి, లవణాలు బయటకు పోతాయి. ఫలితంగా డీహైడ్రేషన్‌కు గురై పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఎండప్రభావం ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులపై పడే అవకాశం ఉంది. వీటి నివారణకు శరీరానికి కావాల్సినంత నీరు, నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కొబ్బరి నీరు, పెరుగు, మజ్జిగ తీసుకోవాలి. ఆల్కాహాల్, టీ, కాఫీ, ధూమపానానికి దూరంగా ఉండాలి.

వడదెబ్బకు గురైతే...

● వడదెబ్బతో అస్వస్థతకు గురైన వారిని చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లాలి.

● తల నుంచి కాళ్ల వరకు తడిగుడ్డతో తుడవాలి.

● గాలి అందేలా చూస్తూ తేరుకున్నాక ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి.

● ఆ తర్వాత ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

జాగ్రత్తలు

● మధ్యాహ్నం సమయంలో తప్పనిసరి అయితే తప్ప బయటకు వెళ్లొద్దు.

● పిల్లలు ఎండలో ఆడకుండా పర్యవేక్షించాలి. తగిన నీరు తాగేలా చూడాలి. డయేరియాకు గురికాకుండా తేలికపాటి ఆహారం ఇస్తూ నూనె పదార్థాలు, వేపుళ్లు, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

పండ్ల రసాలు తాగుతున్నారా..?

ఎండ తీవ్రత నేపథ్యంలో వివిధ రకాల సమస్యలు తలెత్తుతాయి. దాహంతో అల్లాడుతుంటారు. ఉపశమనానికి శీతల పానీయాలు, పండ్ల రసాలు తాగేందుకు ఆసక్తి చూపుతుంటారు. బహిరంగంగా విక్రయించే పండ్ల రసాలతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి. ఇటీవల పిల్లలు, వృద్ధులను పరీక్షిస్తే ఈ విషయం బయటపడిందని, ప్రస్తుతం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

● బహిరంగ దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించే పండ్ల రసాలు, రంగురంగుల జ్యూస్‌లను ప్రజలు విపరీతంగా తాగుతుంటారు. వీటిలో వినియోగించే ఐస్ గడ్డలతో ఆరోగ్యం దెబ్బతింటుంది. వాటి తయారీలో వాడే నీరు కలుషితమైతే ప్రమాదమే. తయారీదారులు స్వచ్ఛమైనవి వాడకపోతే మలబద్దకం, విరేచనాలు, హెపటైటీస్-ఎ తదితర వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

● రకరకాల రంగుల్లో శీతల పానీయాలు సైతం లభ్యమవుతున్నాయి. వీటి తయారీకి కృత్రిమ రంగులను వినియోగిస్తారు. ఇవి జీర్ణవ్యవస్థను దెబ్బ తీస్తాయి. మూత్ర పిండాలు దెబ్బతింటాయి.

● ఐస్ తినడం వల్ల దంతాలు దెబ్బతింటాయి. గొంతు నొప్పి, ఇన్‌ఫెక్షన్లు వ్యాపిస్తాయి. బయటికి వెళ్లిన సమయంలో అత్యవసరమై తాగాల్సి వస్తే ఐస్ లేకుండా జ్యూస్ తీసుకోవాలి. అప్పటికప్పుడే తయారు చేయించుకుని తాగితే మరీ మంచిది. రంగుల్లో ఉండే పానీయాల జోలికి వెళ్లకపోవడం మరింత మంచిది.

● రోడ్లపై లభించే ఇలాంటి పండ్ల రసాలు కాకుండా సహజ సిద్ధమైన నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీరు తీసుకోవడం వల్ల దప్పిక తీరడంతో పాటు శరీరానికి పోషకాలు లభిస్తాయి.



రోడ్ల వెంట ఏర్పాటు చేసిన జ్యూస్ బండి

ఎండ, అల్ట్రా కిరణాలతో చెడు ప్రభావం

ఉమ్మడిజిల్లాలో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతకు తోడు అల్ట్రా వయోలెట్ కిరణాలు, వడగాలులు శరీరంపై చెడుప్రభావం చూపే అవకాశం ఉంది. వివిధ వృత్తులు చేసేవారు, రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నా రు. వీలైనంత వరకు వ్యవసాయ పనులను ఉద యం లేదా సాయంత్రం చేసుకోవాలి. తప్పనిసరై మ ధ్యాహ్నం చేయాల్సి వస్తే తలపై ఎండ పడకుండా టోపీ, గొడుగు ధరించాలి. నీరు చెమట రూపంలో బ యటకు వెళ్లనున్నందున నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలి. రైతులు పశువులు, గొర్రెలు, మేకలను మేత కు తీసుకెళ్లినప్పుడు నీడ పట్టున చెట్ల కింద సేద తీరేలా చూడాలి.

వాహనాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

జీవన యానంలో వాహనాల వినియోగం కీలకంగా మారింది. ప్రస్తుతం ఎండ తీవ్రత నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని మెకానిక్‌లు సూచిస్తున్నారు. బైకులు, కార్లే కాక ఎలక్ట్రికల్ వాహనాలను ఎండ సమయంలో వనియోగించినప్పుడు టైరు, ట్యూబ్‌లు సరి చూసుకోవాలి. పెట్రోల్, డీజిల్ ఎప్పుడూ ఫుల్ ట్యాంక్ చేయించవద్దు. నిర్ణీత వ్యవధిలో ఇంజన్ ఆయిల్ మార్చాలి. ఆగకుండా ఎక్కువ దూరం ప్రయాణం చెయ్యకూడదు. ఇంజన్ ఎప్పుడూ చల్లగా ఉండేలా ప్రయాణం కొనసాగించాలి. రేడియేటర్ కూలింగ్ తనిఖీ చేసుకోవాలి. బ్యాటరీ వాహనాలు అటు ఫుల్, ఇటు జీరో చార్జింగ్ అయ్యే వరకు చూడొద్దు. పార్కింగ్ సమయాన నీడ ప్రాంతాలను ఎంచుకోవాలి.

ఉపకరణాలన్నీ ఒకేసారి వాడొద్దు

వేసవి.. అధిక ఉష్ణోగ్రత ఉన్న నేపథ్యంలో ఇళ్లల్లో అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలను ఒకేసారి వినియోగించకపోవడమే మంచిదని భూదాన్‌పోచంపల్లికి చెందిన ఎలక్ట్రీషియన్ విఘ్నేష్ చెబుతున్నారు. ఆయన సూచనల మేరకు గృహవాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏసీలు, గీజర్, బోరు వంటి అధిక లోడ్ తీసుకునే పరికరాలను ఒకేసారి వాడితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. అవసరాలకు అనుగుణంగా.. ఓల్టేజీ ఆధారంగా ఉపకరణాలను వినియోగించాలి. ఎండతీవ్రత ఉన్న కాలంలో వైరింగ్ సరిచూసుకోవాలి. ఇంటి వై రింగ్‌కు తప్పనిసరిగా ఎర్తిం గ్ ఉండేలా చూసుకోవాలి. ఎర్తింగ్ ప్రాంతంలో అప్పుడప్పుడు నీరు పోయాలి.



● విఘ్నేష్, ఎలక్ట్రీషియన్, భూదాన్‌పోచంపల్లి

హోరాహోరీగా ఎద్దుల పోటీలు



సీనియర్ విభాగంలో తలపడుతున్న గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : మఠంపల్లి శుభవార్త దేవాలయ మహోత్సవాలను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు నాలుగో రోజు మంగళవారం సీనియర్ విభాగ పోటీలు హోరాహోరీగా జరిగాయి.ఈ పోటీల్లో నల్లగొండ సూర్యాపేట, ఖమ్మం, వరంగల్, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా నుంచి 10 జతల గిత్తలు పాల్గొన్నాయి. ఎండ సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పోటీలు జరుగుతున్నాయని యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన సీనియర్ విభాగంలో మొత్తం 10జతలు పాల్గొనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు, యువజన సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూ కేటగిరీ విభాగంలో విజేతలు వీరే...

ఎద్దుల పందేల పోటీల్లో భాగంగా న్యూ కేటగిరీ విభాగంలో రెండు రాష్ట్రాల గిత్తలు సత్తా చాటాయి. హోరాహోరిగా జరిగిన ఈ కేటగిరీ విభాగంలో పల్నాడు జిల్లా గిత్తలు నాలుగు బహుమతులను గెలుచుకున్నాయి. ఆర్‌కే బుల్స్ అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి బాపట్ల జిల్లా గిత్తలు 4618.8 అడుగులు లాగి మొటి బహుమతి గెలుచుకున్నాయి. సంపటం వీర బ్రహ్మనాయుడు పల్నాడు జిల్లా రెండో బహుమతి, జీఎల్‌ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎన్టీఆర్ జిల్లా మూడో బహుమతి, జక్కుల సహస్రయాదవ్ హుజూర్‌నగర్ సూర్యాపేట జిల్లా నాలుగో బహుమతి, ఆర్‌వీఎస్ బుల్స్ చిన్నపులిపాక తోలవల్లూరు పల్నాడు జిల్లా వాసి ఐదో బహుమతి, కృష్ణాజిల్లాకు చెందిన కాకర్ల సురేష్‌బాబు గిత్తలు ఆరో బహుమతి, సిద్ద మల్లేశ్వరి ప్రకాశం జిల్లా గిత్తలు ఏడో బహుమతి, ఎస్‌కే జమీల్ కోరంబావి నల్లగొండ జిల్లా, తెలంగాణ గిత్తలు ఎనిమిదో బహుమతి, పల్నాడు జిల్లాకు చెందిన షేక్ బడేసా గిత్తలు తొమ్మిదో బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు స్థానిక నాయకులు, దాతలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాలువలతో సత్కరించి షీల్డ్, నగదును అందజేశారు.

4న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు



మాట్లాడుతున్న గండూరి కృపాకర్

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో మే 4వ తేదీన అండర్-7, 9, 15 బాలుర, బాలికలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ తెలిపారు. సూర్యాపేటలోని ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించేలా చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని గమనించి ఆదిశగా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తప్పని సరిగా జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఎల్. సతీష్‌కుమార్ 93947 53343కు సంప్రదించాలన్నారు.

మహిళ అవయవదానం



అలివేలు (ఫైల్‌ఫొటో)

దేవరకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన ఓ మహిళ అవయవాలను ఆస్పత్రికి అప్పగించి దాతృత్వం చాటుకున్న కుటుంబ సభ్యులు వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గొట్టిముక్కుల గ్రామానికి చెందిన అవుల వెంకటయ్య అలివేలు దంపతులు హైదరాబాద్‌లో పదేళ్లుగా రైస్‌మిల్లులో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 21న అలివేలు(42) ఇంట్లో పని చేసుకుంటూ ఒక్కసారిగా కల్లుతిరిగి పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో గల కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బ్రెయిన్‌డెడ్ అయిందని నిర్ధారిం చి వెంటిలెటర్‌పై ఉంచారు. కాగా మంగళవారం ఉదయం అలివేలు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కామినేని ఆస్పత్రి డాక్టర్ కమలేష్ సూచన మేరకు కుటుంబ సభ్యులు అలివేలు అవయవాలను కండ్లు, రెండు కిడ్నీలు, లీవర్లను హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి అప్పగించారు. అలివేలు సోదరుడు శ్రీనివాస్, భర్త వెంకటయ్య మాట్లాడుతూ.. అలివేలు మృతి చెందినప్పటికి ఆమె అవయవాలను సమాజంలోని నలుగురికి ఉపయోగపడుతాయని ఉద్దేశంతో ఆస్పత్రికి అప్పగించినట్లు తెలిపారు. నిరుపేద కటుంబమైనప్పటికీ అవయవాలను ఆస్పత్రికి అప్పగించి ఆ కుటంబ సభ్యులను పలువురు అభినందించారు.

ఉపాధి ఆధారిత శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ)లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్.లక్ష్మి తెలిపారు. 6నెలల కాలపరిమితి గల ఎలక్ట్రీషియన్ (డోమెస్టిక్) సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీసెస్ కోర్సుకు ఐటీఐ/ డిప్లొమా పాసైన వారు అర్హులని తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీటీవీ టెక్నీషియన్ కోర్సులకు పదో తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్ కోర్సుకు 8వ తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని తెలిపారు. 18-25 ఏళ్ల మధ్య వయస్సు గల వారై ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు అర్హతల సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, 2 పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డు, ఇన్‌కం స ర్టిఫికెట్లతో స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దరఖాస్తులతోపాటు మే 7న బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 9133908000, 9133908111, 9933908222 లేదా 9948466111 కు సంప్రదించాల్సిందిగా ఆమె తెలిపారు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



స్వామివారి నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపైన కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం దళార్చనలు, నృసింహుడికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిని చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతభిషేకం చేసిన అర్చకులు సింధూరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చన చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య కళ్యాణ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్ర హవనం, సీతారామచంద్రస్వామి వసంతోత్సవాలు శైవగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం విష్ణుపుష్కరిణి కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వార రూ.24,39,016 ఆదాయం సమకూరినట్లు ఆల య ఏ భాస్కర్‌రావు తెలిపారు.

34 రోజుల్లో రూ.2.41కోట్ల ఆదాయం

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ ఖజానాకు 34 రోజుల్లో రూ.2.41 కోట్ల హుండీ ఆదాయం లభించింది. మార్చి 26 నుంచి ఈ నెల 28వ వరకు నృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. లెక్కింపులో నగదు రూ.2,41,35,238, 143గ్రాముల మిశ్రమ బంగారం, 4.250కిలోల మిశ్రమ వెండి సమకూరింది. విదేశీ కరె న్సీ 702 అమెరికా డాలర్లు, 210 ఆస్ట్రేలియా డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 70 ఇంగ్లండ్ పౌండ్లు , 140 నేపాల్సీ రూపీ, 435 సౌదీ రియాల్, 10 యూరోలు, 12 ఒమన్ రియాల్, 31 మలేషియా రింగ్గిట్, 2.25 ఖతార్ రియాల్, 40 థాయిలాండ్ బాట్, 1000 శ్రీలంక కరెన్సీ, 20,000 టాంజానియా కరెన్సీ, 245 అరబ్ ఎమిరేట్స్ కరెన్సీ, 100 నార్వే కరెన్సీ హుండీలో కానుకల రూపంలో రావటంతో ఆలయ ఖజానాలో జమచేసినట్లు దేవస్థాన ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో సినీనటుడు రాజేంద్రప్రసాద్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మంగళవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు.



రాజేంద్రప్రసాద్‌కు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు

మట్టపల్లిలో స్తంభోద్భవుడికి విశేష అర్చనలు

మఠంపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రీస్వామికి మంగళవారం విశేష అర్చనలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవుడికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమం చేపట్టారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాబోధి నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. ఉదయం 9:30గంటలకు లక్ష్మీనృసింహుని పరిణయోత్సవ క్రతువు ప్రారంభమైంది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుని మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన వేదపండితులు నిర్వహించారు.పలువురు భక్తులు పీఠాలపై ఆసీనులై స్వామివారి కల్యాణం యజ్ఞోపవీత మాంగళ్య దారణల యథావిధిగా జరిగాయి. మధ్యాహ్నం 11గంటలకు రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహర్నివేదనలు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలోనూ బ్రహ్మీ మహూర్తంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈఓ సరికొండ నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	514.40
టీఎంసీలు	139.1486
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,350 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	28.71 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	4000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	630.65 అడుగులు
టీఎంసీలు	1.48
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	293. 40 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	52.79 క్యూసెక్కులు

బకాయిలు ఎప్పుడిచ్చేనో?

(5వ పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి కళాశాలల బకాయిలపై స్పందించకపోవడంతో యాజమాన్యాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు. దీంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నామని విద్యార్థులు బావురుమంటున్నారు. మరో పక్క అధ్యాపకులకు నెలల తరబడి వేతనాలు, భవన యజమానులకు అద్దెలను యాజమాన్యాలు బకాయిపడ్డాయి. ఇదిలా ఉంటే దోస్త్ (తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్)తో డిగ్రీలో 2023-24 విద్యా సంవత్సరంతో పోల్చితే 2024-25లో అడ్మిషన్లు తగ్గడం కళాశాలల యాజమాన్యాలను ఆందోళనపరుస్తోంది. విద్యార్థులు తగ్గడం, అరకొరగా వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో, కళాశాలలను ఎలా నడపాలో అర్థం కావటంలేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సీఎం చొరవతీసుకొని బకాయిలను విడదల చేసి, పరీక్షలు జరిగేలా చూడాలని కళాశాలల యజమానులు, విద్యార్థులు కోరుతున్నారు.

వచ్చే నెల 15కు పరీక్షలు వాయిదా

కళాశాలల బంద్ చేపట్టడంతోపాటు ప్రాక్టికల్స్ పరీక్షలను ప్రైవేట్ కళాశాలలు బహిష్కరించాయి. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో యాజమాన్యాలు ఈ నెలలో యూనివర్సిటీ పరిధిలో జరగాల్సిన థియరీ పరీక్షలకు దూరంగా ఉన్నాయి. ఈ నెల 11 నుంచి జరగాల్సిన 2, 4, 6వ సెమిస్టర్‌తో పాటు, బ్యాక్‌లాక్ పరీక్షలను ఎంజీయూ మే 15కు వాయిదా వేసింది. అయితే సకాలంలో జరగాల్సిన పరీక్షలు వాయిదా పడటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఏళ్లుగా అందని ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్

ప్రభుత్వం విద్యార్థులకు ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్ కింద ఉపకార వేతనాలు ఇస్తుంది. మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజు(ఎంటీఎఫ్) కింద విద్యార్థికి నెలకు రూ.500చొప్పున, 10 నెలలకు రూ.5,000 ఇస్తుంది. ఆ ఫీజు విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌లో జమచేస్తుంది. ఎంటీఎఫ్ రెండేళ్లుగా విద్యార్థులు అందడం లేదు. అదే విధంగా రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్‌టీఎఫ్) కింద సైన్ విద్యార్థులకు రూ.12వేలు, ఆర్ట్స్ విద్యార్థులకు రూ.9వేలు కళాశాల ప్రిన్సిపాల్ అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేస్తుంది. ఇది నాలుగేళ్లుగా రావడంలేదని కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు.

తగ్గిన అడ్మిషన్లు

ఎంజీ యూనివర్సిటీ పరిధిలో 50 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 30వేల సీట్లు ఉన్నాయి. 2024 విద్యా సంవత్సరంలో మొదటి ఏడాదిలో సుమారు 6వేల మంది విద్యార్థులు చేరారు. 12 కళాశాలల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయి. 30 కళాశాలల్లో కేవలం 30మంది మాత్రమే చేరారు. దీంతో కళాశాలలకు వచ్చే ఫీజురీయింబర్స్‌మెంట్ తక్కువగా ఉంటుంది. వచ్చే అరకొర రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు చెబుతున్నాయి. చివరికి అటెండర్లకు, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

చెల్లిస్తే ఇబ్బందులు ఉండవు



ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి. నాలుగేళ్లుగా రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో పైసలు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. అప్పు తెచ్చి కళాశాలలు నడుపుతున్నాం. డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని రెండు, మూడుసార్లు ఆయన హామీ ఇచ్చారు. 2023లో రూ.25కోట్ల బకాయిలకు ట్రెజరీశాఖ టోకెన్లు ఇచ్చింది. వాటిలో కొంతమందికి రూ.లక్ష, రూ.50వేలు వచ్చాయి. కొంతమందికి అసలు రాలేదు. సంవత్సరాల తరబడి ఫీజులు రాకపోతే కళాశాలలు ఎలా నడపాలో ప్రభుత్వమే చెప్పాలి. గత్యంతరం లేక ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తే పరీక్షల నిర్వహణకు సహకరిస్తాం.

బి.సూర్యనారాయణరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలి

రామగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గత సంవత్సరం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాంనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ నారాయణఅమిత్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేసిన పనుల డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన వెంకటేశ్వర్లు

నల్లగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పోలీస్ కంప్లెయిట్స్ అథారిటీ సభ్యుడు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మర్యాద పూర్వంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను పోలీస్ కంప్లెయిట్స్ అథారిటీ సభ్యుడిగా నియమించిన సందర్భంగా సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు మెరుగైన సేవలు అందజేస్తానని పేర్కొన్నారు.

ధాన్యం రవాణాకు ప్రాధాన్యం

రఘునందన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ



ఇంటర్వ్యూ Interview

ధాన్యం కొనుగోలులో భాగంగా సకాలంలో ఎగుమతి, దిగుమతి అయ్యేలా చూస్తున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తెలిపారు. .
(నల్లగొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ధాన్యం రవాణాకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ: ధాన్యం రవాణాకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను ఎప్పటికప్పుడూ పంపిస్తున్నాం. అవసరమైతే ట్రాక్టర్లు, డీసీఎంలను సైతం సమకూరుస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలను సకాలంలో పంపేందుకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: లారీ యజమానులతో సమావేశాలు నిర్వహించారా?

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ: ధాన్యం రవాణాకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మంగళవారం సాయంత్రం లారీ కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాం. ధాన్యం రవాణాకు ఆటంకం కలగకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

డీటీ: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరణ విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఐకేపీ, ఏపీఏసీఎస్, ఎఫ్‌పీవోల కేంద్రాల వద్ద ఆయా సెంటర్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి ధాన్యాన్ని సేకరించాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోలు నిర్వాహకులు ఎలాంటి రిజిస్టర్లు మెయింటెన్ చేస్తారు?

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వద్ద రైతుల వివరాలకు సంబంధించిన రిజిస్టర్లు ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు ధాన్యం సేకరణ ముగిసే వరకు ఆయా రికార్డులను, పుస్తకాలను జాగ్రత్తగా ఉంచాల్సి బాధ్యత ఆయా సెంటర్ల ఇన్‌చార్జిలదే. రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులు చిత్తశుద్ధితో పనిచేయాలి.

విలీన ప్రాంతాలకు మహర్దశ



12వ వార్డులో పూర్తి అయిన సీసీ రోడ్డు నిర్మాణం

- రూ. 53 కోట్లతో సీసీరోడ్లు, ఓపెన్ డ్రైనేజీ
- ఇప్పటికే 60శాతంకు పైగా నిర్మాణాలు పూర్తి
- నల్లగొండ మునిసిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నల్లగొండ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు ఆ తర్వాత వార్డులుగా రూపాంతరం చెందాయి. అయితే అప్పటి ప్రభుత్వం ఆయా గ్రామాలను విలీనం చేసినా అభివృద్ధి మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ మునిసిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. నల్లగొండ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులతో పాటు రోడ్ల నిర్మాణం వల్ల రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా ఉండాలన్న ఆలోచనతో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. ఇందులో ముఖ్యంగా సీసీ రోడ్లతో పాటు ఓపెన్ డ్రైనేజీలకు నిధులను విడుదల చేశారు. దీంతో నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలో విలీనమైన మర్రిగూడ, చర్లపల్లి, ఆర్జాలబావి, కతాల్‌గూడెం, కేశరాజుపల్లి, శేషమ్మగూడెంతో పాటు 18,19వ వార్డులు, హౌజింగ్ బోర్డు కాలనీ, చింతబాయిగూడెం, లెప్రసీ కాలనీలో ముమ్మరంగా రోడ్ల నిర్మాణాలతో పాటు ఓపెన్ డ్రైనేజీ పనులు సాగుతున్నాయి.

రూ. 53 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ

నల్లగొండ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలకు పీయూఎఫ్ఐడీసీ కింద రూ.53 కోట్లను విడుదల చేయడంతో పాటు 60 కిలోమీటర్ల సీసీ రోడ్లను, టఫ్ ఐడీసీ కింద 38 కిలోమీటర్ల ఓపెన్ డ్రైనేజీను చేపట్టారు. ఇప్పటికే 60 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. ఈ నిధులతోనే 18, 19వ వార్డుల్లో కూడా సీసీ రోడ్లను చేపట్టారు. కొద్దిపాటి వర్షం వచ్చిన నల్లరేగడి మట్టిలో నడవడానికి ఇబ్బందులు తలెత్తుతుండటంతో ఆ రెండు వార్డులలోనూ సీసీ రోడ్లు పనులు ప్రారంభించారు. నల్లగొండ పట్టణంలో విలీనమైన గ్రామాల్లో రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ పనులను ముమ్మరంగా పూర్తి చేసేలా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డికి సూచనలు చేశారు. అదేవిధంగా నాణ్యత విషయంలో పూర్తి పారదర్శకంగా ఉండేలా చూడటంతో పాటు త్వరితగతిన రోడ్లను, ఓపెన్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నల్లగొండ పట్టణంలోని వార్డుల్లో విలీనమైన ప్రాంతాలతో రోడ్లను పెద్ద ఎత్తున నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే 40 కిలోమీటర్ల వరకు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మరో నెల రోజుల్లో విలీనమైన గ్రామాల్లో రోడ్ల నిర్మాణంతో పాటు ఓపెన్ డ్రైనేజీ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు.



త్వరలోనే పట్టణంలోని మిగతా ప్రాంతాల్లో....

నల్లగొండ మునిసిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ పనులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన మంత్రి వెంకట్‌రెడ్డి త్వరలోనే నల్లగొండ పట్టణంలోని మిగతా వార్డులకు కూడా సీసీరోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా నిధులను కేటాయించి టెండర్లను కూడా ఆహ్వానించనున్నారు. శివారు ప్రాంతాల్లో ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. ఈ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్లను వేయనున్నారు. డ్రైనేజీ వేయకుండా సీసీ రోడ్లను వేస్తే మళ్లీ తవ్వకాలు జరిపితే రోడ్లు దెబ్బతినే అవకాశం ఉండటంతో ముందుగా యూజీడీ పనులను పూర్తి చేసి ఆ తర్వాత సీసీ రోడ్లకు టెండర్లను ఆహ్వానించనున్నారు. ఇందుకోసం నల్లగొండ మునిసిపల్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. వార్డులు, కాలనీల వారీగా ప్రజల అవసరాలను కాలనీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

రోడ్ల నిర్మాణంతో కాలనీల అభివృద్ధి



ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో నల్లగొండ పట్టణంలోని 19వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు మొదలయ్యాయి.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో తమ వార్డులో డ్రైనేజీ నిర్మాణంతో పాటు సీసీరోడ్ల నిర్మాణం ప్రారంభించారు. అదేవిధంగా నీటి సమ స్య పరిష్కారం కోసం ట్యాంకు నిర్మాణం చేపట్టడం జరిగింది.మరో ఆరునెలల్లో వార్డులోఅభివృద్ధి పనులు పూర్తవుతాయి. రోడ్ల నిర్మాణాలు పూర్తయితే కాలనీలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయి.

– గోగుల గణేష్, శ్రీనగర్ కాలనీ, నల్లగొండ

60 శాతం రోడ్ల నిర్మాణం పూర్తి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో నల్లగొండ మునిసిపాలిటీలో విలీమైన గ్రామాల్లో ఇప్పటికే 60 శాతానికి పైగా సీసీ రోడ్ల నిర్మాణం, ఓపెన్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో మిగతా రోడ్ల నిర్మాణాలు, ఓపెన్ డ్రైనేజీ పూర్తవుతాయి. రోడ్లు, ఓపెన్ డ్రైనేజీ పనులను నాణ్యతతో నిర్మాణాలు చేపడుతున్నాం. నల్లగొండ పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నాం. త్వరలోనే మిగతా నిధులతో అభివృద్ధి పనులను చేపడుతాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్,
మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

'ఇందిరమ్మ' లబ్ధిదారుల సర్వే



లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

గట్టుప్పల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను విచారణ అధికారి, ఎంపీడీవో యాదగిరి ఇంటింటికి వెళ్లి తెలుసుకున్నారు. గట్టుప్పల్ మండలకేంద్రంలో మంగళవారం తొలిదశలో విడుదలైన దాదాపు 50మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటికి ఆయన వెళ్లి క్షేత్రస్థాయి వివరాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షఫీ, బిల్ కలెక్టర్ యాదయ్య ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

శాలిగౌరారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలవ్యాప్తంగా మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని, అన్ని గ్రామాల్లో మే డే కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. ఆనాడు చికాగో నగరంలో 1889 మే 1న జరిగిన కార్మికవర్గ పోరాటంలో ఎనిమిది గంటల పని దినం ఉండాలని చేసిన పోరాటంలో ఎంతోమంది అమరులైనట్లు తెలిపారు. అందుకే మే ఒకటో తేదీన కార్మికుల పండుగగా నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల నాయకులు మక్క బుచ్చి రాములు, ఎర్ర రమేష్, గుండ్లపల్లి వెంకన్న, బల్లెం వెంకటయ్య, బట్ట అవనిజ, డెంకల లింగయ్య, జూలూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం



కట్టంగూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కట్టంగూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఆశ్రిత ఎన్జీవో అధికారి బూరుగు శారదారాణి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం బాల్యవివాహాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఆడపిల్లలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే ఆడపిల్లలకు వివాహం చేయాలని సూచించారు. అనంతరం బాల్య వివాహ విముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్, పూజారి యుగేందర్ శర్మ, కోఆర్డినేటర్ శోభారాణి, జాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



బొడ్రాయికి అభిషేకం చేసిన పూజలు చేస్తున్న మహిళలు

నల్లగొండటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గల బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మంగళవారం బొడ్రాయికి నీళ్లతో అభిషేకాలు చేసి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మహిళలు తమ ఇళ్ల నుంచి బిందెలతో నీళ్లు తీసుకువచ్చి బొడ్రాయికి ఘనంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణ బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు కందుల నిర్మలమ్మ, ప్రధాన కార్యదర్శి అభిమన్యు శ్రీనివాస్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి 8 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ప్రత్యేక పూజలు తో పాటు బలి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 30వ తేదీ బుధవారం రోజు ఉదయం 7 నుంచి మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్ల శ్రీను, అక్కెనపల్లి బలరాం, దేవుని మల్లయ్య, పెరిక నర్సింహ, లకడాపురం వెంకటేశ్వర్లు, బోనగిరి శివ, బలరాం, గుండెబోయిన వెంకన్న, శ్రీనివాస్, లక్ష్మయ్య, సత్యనారాయణ, కందుల బాలరాజు, వెంకటరమణ, తేజ, తరున్, మణికంఠ, దనుష్క, మహదేవ, మల్లికార్జున్, శ్రీను, వాణి, యశ్వంత్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

క్రికెట్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

నల్లగొండస్పోర్ట్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యువ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఇండియన్ మాజీ క్రికెటర్ అర్షద్‌అయూబ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్‌డీసీఏ శిక్షణ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాక్షించారు.

అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ యువకులు ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ పొంది రాణించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, అసోసియేట్ సెక్రటరీ అమీనుద్దీన్, రమేష్, షఫీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలి

- ఊట్కూర్ గ్రామస్థుల ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఊట్కూరు గ్రామ మహిళలు

శాలిగౌరారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వేముల శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బొంగరాల నరసింహలు డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండలకేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊట్కూరు గ్రామంలో తాగడానికి మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలోని 4,5,6వ వార్డుల్లో మసీదు రోడ్డు నుంచి బస్టాండ్ వరకు గ్రామపంచాయతీ వరకు 150 కుటుంబాలకు పైగా ప్రజలు జీవవిస్తున్నారని, వారికి తాగడానికి మంచినీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో గ్రామస్థులు అనారోగ్యంతో పాటు అసౌకర్యానికి గురవుతున్నట్లు వాపోయారు. వీధిలైట్లు సైతం లేకపోవడంతో చీకట్లో బయటికి వెళ్లేందుకు భయపడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఈ మూడు సమస్యలను అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంటింటికీ నల్ల కనెక్షన్ ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు వెంకన్న, నాయకులు ఏనుగు సత్తిరెడ్డి, లింగయ్య, రాములు, ముత్తయ్య, కప్పల స్వరాజ్యం, వెంకటమ్మ, రాములమ్మ, పూలమ్మ, జానమ్మ, అలివేలు, భారతమ్మ, సావిత్రమ్మ, రేణుక, సత్తెమ్మ పాల్గొన్నారు.

లారీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

చిట్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. సీపీఎం అనుబంధ రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కృష్ణానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లుల వద్ద జరిగే లారీల వెయిటింగ్ చార్జీలను రైతులపై మోపవద్దని కోరారు. మండలంలోని కొన్ని కొనుగోలు కేంద్రాలకు లారీలు పంపడం లేదని ఆరోపించారు. ఇక్కడ కొనుగోలు కేంద్రాల నుండి మిర్యాలగూడెం మిల్లులకు ధాన్యం పంపవద్దనీ కోరారు. ఈ కార్యక్రమంలో అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నర్సింహ్మా, అరూరి శ్రీను, బొబ్బల సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య, రూపని ఇద్దయ్య తదిరతరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కనగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో వైశాఖమాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించారు. చీర సారె, ఒడిబియ్యం బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి మహా మంగళ నీరాజన హారతులిచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

కనగల్,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి కోరారు. మండలంలోని దర్వేశిపురంలో అమ్మవారి ఆలయం వద్ద జగిని టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగిని టెక్స్‌టైల్స్ వారు సామాజిక బాధ్యతగా చేపడుతున్న సేవా కార్యక్రమాల ను ప్రశంసించారు. కార్యక్రమంలో సీఐ ఆదిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, జగిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంగదేవమ్మ ఆలయ నిర్వహణకు విరాళం

శాలిగౌరారం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలోని గంగదేవమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కల్యాణోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కట్టంగూరి మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి ఆలయ నిర్వహణ నిమిత్తం ఆలయ కమిటీకి రూ.10,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, నాయకులు షేక్ ఇంతియాజ్ అహ్మద్, చింత ధనుంజయ్, చెరుకు జానయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆసక్తితో చదువుకోవాలి

నకిరేకల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవో మేక నాగయ్య అన్నారు. నకిరేకల్ మండలంలోని చందపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షులైన ఉపాధ్యాయులు, మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. వేసవి శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న చిత్రలేఖనం, అభినయ గేయాలు, వ్రాత అంశాలను ఆయన పరిశీలించి అభినందించారు. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా వేసవి క్యాంపులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రకంటి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

- పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి
- క్రియాశీలక సభ్యత్వ కార్డుల పంపిణీ



నకిరేకల్‌లో సభ్యత్వ నూతన కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు తుమ్మల మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సభ్య త్వ కార్డులను వారు పంపిణీ చేసి మాట్లాడారు. 1985లో దేశ చరిత్రలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏకైక పార్టీ తెలుగుదేశమన్నారు. అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకొక సారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి కార్యకర్తలకు ప్రమాద బీమాను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకునూరి సత్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్: తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చే సేందుకు ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య అన్నారు. నకిరేకల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో క్రియాశీలక సభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. టీడీపీ సభ్యత్వ కార్డు కార్యకర్తలు ఎంతో ముఖ్యమైన వని, ప్రమాదబీమా 5లక్షల వరకు ఉన్నందును జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు, మండల కమిటీలు, అనుబంధ కమిటీలను త్వరలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఎన్నుకోవాలన్నారు.

అన్ని కమిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఉండే విధంగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డి, మాజీ అధికార ప్రతినిధి నక్క రాంబాబు‌నేష్ ముదిరాజ్, మాజీ కార్యదర్శి లింగాల యాదయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి గద్దపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీసీసెల్ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దొమ్మాటి సైదులు, బండారపు శివరామ్‌ప్రసాద్, పసుపులేటి కృష్ణారెడ్డి, నకిరేకంటి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 కనిష్ఠం 25.8

ఏం జరిగింది...

యాదాద్రి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజీవ్స్‌లో రాకెట్ లాంచ్ ప్రొఫెలెంట్ తయారీ సందర్భంగా పేలుడు సంభవించింది.

ప్రమాదం...

సాయంత్రం 4.45 నిమిషాలకు భారీ పేలుడు ప్రభావం చుట్టు పక్కల ఆరు కిలోమీటర్ల వరకు కనిపించింది.

మృతులు : ఒకరు

శకలాల కింద ఉన్నవారు : ఇద్దరు

గాయపడిన వారు : ఆరుగురు



పేలుడు ధాటికి పూర్తిగా ధ్వంసమైన భవనం

కదిలిస్తే కన్నీళ్లే



గాయపడిన ఓ కార్మికుడు

- విధులు ముగించుకొని వెళ్లే సమయంలో ప్రమాదం
- ప్రొఫెలెంట్ పేలుడుతో భారీ ప్రమాదం
- ఘటనలో ఒకరు మృతి.. ఇద్దరు గల్లంతు.. ఆరుగురికి తీవ్రగాయాలు
- మోటకొండూరు మండలం కాటేపల్లిలో ఘటన

వారివి రెక్కాడితేగాని.. డొక్కాడని కుటుంబా లు. పొద్దస్తమానం కష్టపడితే తప్ప కుటుంబాలను పోషించుకోలేని దీనస్థితి. ఉదయం ఆరు గంటలకు విధుల్లో చేరిన వారు ఇంకో పావుగంటలో ఇంటికి వెళ్తారనుకునే సమయానికి ఒక్కసారికి విధి వక్రించింది. అప్పటిదాకా అంతా పనిచేసిన బ్లాక్‌లో భారీ పేలుడు సంభవించి కొందరి శరీరాలు చెల్లాచెదురు కాగా, శిథిలాల కింద చిక్కుకున్నారు. ఇంకొందరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రులకు తరలించారు. మంగళవారం ఈ ఘటన మోటకొండూరు మండలం కాటేపల్లిలో ని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో జరిగింది. ఈ పేలుడు ధాటికి రెండు కిలోమీటర్ల వరకు భూమి కంపించినట్లయిందని స్థానికులు పేర్కొన్నారు. శకలాల కింద మరింత పేలుడు పదార్థం ఉండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోననే భయానక వాతావరణంలో అంతా బిక్కుబిక్కుమంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మోటకొండూరు) ●6లో..



రోదిస్తున్న కార్మికుడి కుటుంబ సభ్యులు

మిన్నంటిన ఆర్తనాదాలు

మోటకొండూరు మండలం కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో శకలాల కింద గల్లంతైన వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల సందీప్ (30) సంవత్సరం క్రితం వివాహమైంది. అతని భార్య నిఖిత ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. మరో వారం రోజుల్లో తన భార్యకు సీమంతం చేద్దామనుకున్నాడు. కానీ అంతలోనే జరిగిన పేలుడు ప్రమాదంలో శకలాల కింద చిక్కుకోవడంతో అతని కుటుంబసభ్యులు కంపెనీ వద్ద రోదిస్తున్న తీరు అక్కడి వారిని కలచి వేసింది.

భూ సమస్యల పరిష్కారానికే ‘భూ భారతి’

కలెక్టర్ ఇలా త్రిపాఠి



భూ భారతి చట్టం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

(ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం): భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. భూభారతి చట్టంలో భాగంగా రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే గ్రామాలకు వస్తారని అన్నారు. భూసమస్యలు 80 శాతం తహసీల్దార్ స్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. ఎమ్మెల్యే మందుల సామేలు,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, భూభారతిని చట్టాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పి.యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, డీటీ వరప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్,ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపైకి వెళ్తున్న రైతును అడ్డుకున్న ఎస్ఐ

భూభారతి అవగాహన సదస్సులో గందరగోళం నెలకొంది. సమస్యను విన్నవించడానికి వచ్చిన రైతును ఎస్ఐ నెట్టివేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సదస్సులో నూలగడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన సంకటి పోతరాజు అనే రైతు తన సమస్యను చెప్పే అవకాశం రాలేదని కొంత హడావుడి చేయడంతో పాటు గొడవ చేశాడు. తాను వేదికపైకి వెళ్లి ఎంపీ, ఎమ్మెల్యేతో మాట్లాడతానని ఎస్ఐతో చెప్పడంతో ఆయన నిరాకరించారు. అతను వేదికపైకి వెళ్తుండగా ఎస్ఐ సైదులు, పోలీసులు అడ్డుకున్నారు. అయినా పోతరాజు, అతని అల్లుడు సింగిరి శ్రీనివాస్ వేదికపై ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా ఎస్ఐ సైదులు తోసివేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడే ఉన్న మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు రైతులు, పోలీసులను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

రికార్డులు సరిగా లేకుంటే చర్యలు

పెద్దవూర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు, లింగంపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, చెల్లింపుల వివరాలను పీఏసీఎస్ సీఈవో వెంకట్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవోపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



బకాయిలు ఎప్పుడిచ్చేనో?

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏళ్లుగా విడుదల చేయకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలు నిర్వహించడంతోపాటు ప్రాక్టికల్ పరీక్షలను బహిష్కరించాయి. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా బకాయిలు అందకపోవడంతో అటు యాజమాన్యాలు, పరీక్షలు నిలిచిపోవడంతో ఇటు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,కోదాడ)

- డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.160కోట్లు
- ఉపముఖ్యమంత్రిని కలిసి విన్నవించినా పరిష్కారానికి నోచని సమస్య
- ఇప్పటికే రెండుసార్లు కళాశాలల బంద్
- ప్రాక్టికల్స్ బహిష్కరణ, పరీక్షలకు దూరం

ఎంజీ యూనివర్సిటీ పరిధిలో 62 డిగ్రీ కళాశాలలు ఉండగా, అందులో 12 ప్రభుత్వ, 50 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ముగిసింది. ఇప్పటికే కళాశాలలకు గత నాలుగేళ్లుగా సుమారు రూ.100కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉండగా, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మరో రూ.60కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. పాత బకాయిలకు సంబంధించి 2023 డిసెంబరులో ట్రెజరీశాఖ టోకెన్లు జారీ చేయగా, ఈ-కుబేర్‌లో ఉన్నాయి. ఈ బకాయిలు నేటికీ అందకపోవడంతో కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బకాయిలు విడుదల కోసం పలుమార్లు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి విన్నవించగా, చెల్లింపులపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. దీంతో చేసేదిలేక యాజమాన్యాలు ఇప్పటికే రెండుసార్లు కళాశాలల బంద్ నిర్వహించడంతోపాటు ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలను బహిష్కరించాయి. అయినా విద్యాశాఖ మంత్రి అయిన సీఎం..

- మిగతా 7వ పేజీలో..

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినా

ఉమ్మడి జిల్లాలో 62 డిగ్రీ కళాశాలలు ఉండగా, వాటిలో 50 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలు సుమారు రూ.100కోట్లు రావాల్సి ఉంది. తాజాగా ముగిసిన విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.60కోట్ల బకాయిలు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తంగా రూ.160కోట్ల బకాయిలు ఉండగా, వీటిని చెల్లించాలని గత ఏడాది అక్టోబరులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కళాశాలల యజమానులు కలిసి విన్నవించారు. దీంతో గత ఏడాది నవంబరులోనే వాటిని చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తిరిగి నవంబరులో డిప్యూటీ సీఎంను యజమానులు కలవగా, డిసెంబరులో చెల్లించేందుకు హామీ ఇచ్చారు.

డిసెంబరులో కలవగా, ఈ ఏడాది జనవరిలో చెల్లిస్తామని చెప్పారని, అయినా నేటికీ బకాయిలు విడుదల చేయలేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. టోకెన్లు ఇచ్చి నెలలు గడుస్తున్నా బకాయిలు అందలేదని దీంతో కళాశాలల బంద్ చేపట్టడంతోపాటు, ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలకు దూరంగా ఉన్నామని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. అయినా ప్రభుత్వంలో చలనం లేదని వాపోతున్నాయి.

వెంటనే బకాయిలు చెల్లించాలి



దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

దేవరకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.4500కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వ హించారు. అనంతరం ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్య వసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు కంభాలపల్లి ఆనంద్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, బీసీ సంఘం నాయకులు వరికుప్పల శ్రీను, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, ఆంజనేయులు, మోతీలాల్, గణేష్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయశాఖలో బదిలీలు, పదోన్నతులు

జేడీఏగా గీత నియామకం

నల్లగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయశాఖలో పలువురు అధికారులను బదిలీ, పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (జేడీఏ)గా రాష్ట్ర కమిషనరేట్‌లో డీడీఏ(డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)గా పనిచేస్తున్న ఎస్.గీతను నియమించారు. అదేవిధంగా ఆత్మ కార్యాలయంలో డీడీఏగా పనిచేస్తున్న సుదర్శనికి జేడీఏగా పదోన్నతి కల్పించి ఆత్మ ప్రాజెక్టులోనే నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. హాలియా ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)గా పనిచేస్తున్న వెంకట్‌రవీంద్రకు డీడీఏగా పదోన్నతి కల్పించి వికారాబాద్ ఆత్మ డీపీడీ (డిస్ట్రిక్ ప్రోగ్రాం డైరెక్టర్)గా బదిలీ చేశారు. మిర్యాలగూడ ఏడీఏగా పనిచేస్తున్న దేవ్‌సింగ్‌కు డీడీఏగా పదోన్నతి కల్పించి యాదాద్రి జిల్లా ఆత్మ డీపీడీగా నియమించారు. నల్లగొండ రైతు శిక్షణ కేంద్రంలో ఏడీఏగా పనిచేస్తున్న వీరప్పకు డీడీఏగా పదోన్నతి కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం ఆత్మ డీపీడీగా బదిలీ చేశారు. నకిరేకల్ ఏడీఏగా పనిచేస్తున్న అనితకు డీడీఏగా పదోన్నతి కల్పించారు.

‘ప్రజావాణి’ దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్



ఫిర్యాదులు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులకు అధికారులు ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’లో 33 మంది ఫిర్యాదులు అందజేశారు. అందులో అత్యధికంగా 14 రెవెన్యూశాఖకు చెందినవి, 19 వివిధ శాఖాలకు చెందిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాఖల వారీగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యమండలి నిబంధనలు పాటించాలి

డీఎంహెచ్‌వో శ్రీనివాస్



మిర్యాలగూడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వసతులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైద్యమండలి సూచించిన నిబంధనలను ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు కచ్చితంగా పాటించాలని డీఎంహెచ్‌వో పి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆయన తనిఖీచేశారు. ఆస్పత్రి అనుమతి పత్రాలతోపాటు ఫైర్‌సేఫ్టీ, ఫీజుల పట్టిక, వైద్యుల విద్యార్హత సూచిక బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్స్ కాలనీలో ఏడు ఆస్పత్రుల్లో సూచిక బోర్డులు లేకపోవడంతోపాటు వైద్యమండలి నిబంధనలను ఉల్లంఘించడంతో నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన రేడియాలజిస్టు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే గుర్తించి నోటీసులు ఇస్తామని, నిబంధనలకు విరుద్ధంగా నడిచే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పీవో డాక్టర్ అరుంధతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, సీహెచ్‌వో నర్సింహ, మోతీలాల్, ప్రభాకర్, రమేష్, తదితరులు ఉన్నారు.కాగా, ప్రైవేట్ ఆస్పత్రులో వైద్యాధికారులు గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు పూర్తిచేశారని, నిబంధనల ఉల్లంఘనతో పాటు ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకున్నా చూసీచూడనట్లు వదిలేసి నోటీసులతో సరిపెట్టారనే చర్చ స్థానికంగా సాగుతోంది. తనిఖీల విషయం తెలుసుకున్న మీడియా అక్కడకు వెళ్లగా, డీఎంహెచ్‌వో ఎలాంటి ప్రకటన చేయకుండానే వెళ్లిపోయారు. ఉమ్మడి జిల్లాలోనే ప్రైవేట్ ఆస్పత్రులు అత్యధికంగా ఉన్న మిర్యాలగూడలో నామమాత్రపు తనిఖీలు చేపట్టి వదిలేస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇందిరమ్మ ఇంటి సర్వేను పూర్తి చేయాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేయాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ, మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ రికార్డుల నిర్వహణ సమర్థంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, సూపరింటెండెంట్ సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగని యూజీడీ పనులు

- మిర్యాలగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో 18 ఏళ్లుగా జాప్యం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు ●8లో..

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే చస్తాం

- చండూరులో మహిళ నిరసన ●6లో..

మేడేను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సయాద్ కోరారు. కారు. జీపు మినీ మోటార్ వెహికిల్స్ యూనియన్ అడ్డా వద్ద ఉన్న సీపీఐ, ఏఐటీయూసీ జెండా దిమ్మెలకు రంగుల వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో అస్గర్, గోపానాయక్, కోశాధికారి వెంకన్న, శ్రీనివాసరాజు, జానయ్య పాల్గొన్నారు.

వ్యక్తి మృతి.. నేత్రాలు దానం

చింతపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్ (మాల్)కు చెందిన జూపల్లి ప్రభాకర్ గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు . కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని వాసన్ ఐ కేర్‌కి ప్రభాకర్ నేత్రాలను దానం చేశారు. దీంతో పట్టణ వాసులు వారికుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

ఉపాధి కూలీలకు పని కల్పిస్తున్నాం

● శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో



మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నట్లు, జాబ్ కార్డుకలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్న ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి పనులకు సంబంధించి మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏపీవో పలువివరాలు వెల్లడించారు.

ఇంటర్వ్యూ Interview

(ఆంధ్రజ్యోతి - పెద్దఅడిశర్లపల్లి)

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి మండ లంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి?

ఏపీవో: ఉమ్మడి పిఏపల్లి, గుడిపల్లి రెండు మండలాలు కలుపుకుని 14,500 జాబ్‌కార్డులు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి:మండలంలో ఏఏ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరు గుతున్నాయి?

ఏపీవో: ఉమ్మడి మండలంలో రెండు పంచాయతీలు ఎర్రగుంటతండా, పెద్దగుమ్మడం తప్ప అన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: కొత్తగా పనులు చేసే వారికి జాబ్‌కార్డు ఇస్తున్నారు.

ఏపీవో: ప్రస్తుతం జాబ్‌కార్డులను అందించడం లేదు.

ఆంధ్రజ్యోతి: పనులు జరిగేచోట పనులకు సంబంధించి ఏవైనా బోర్డులు అమరుస్తున్నారా ?

ఏపీవో: ఉపాధి హామీ పనులు పూర్తయిన తర్వాత కూలీల సంఖ్య, పని దినాలు, అంచనా వ్యయం, రైతు వివరాలు వంటి సమాచారంతో కూడిన బోర్డులను బిగిస్తాము.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పనుల వద్ద వసతులు ఏలా ఉన్నాయి?

ఏపీవో: ఉపాధి హామీ పనిచేసే కూలీలకు పంచాయతీ ఆధ్వర్యంలో నీడ, నీటి వసతులు కల్పిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: కూలీలకు డబ్బులు ఎన్ని రోజులకు అకౌంట్‌లో జమ అవుతున్నాయి?

ఏపీవో: గతంలో ప్రతి 15 రోజుల ఒకసారి అకౌంట్‌లో జమ అయ్యేవి. గత రెండు నెలలుగా ఆలస్యం అయింది. మంగళవారం నుంచి కూలీల అందరి అకౌంట్‌లో జమ అవుతున్నాయి.

ముందుకు సాగని యూజీడీ పనులు

▶▶ మిర్యాలగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో 18 ఏళ్లుగా జాప్యం ▶▶ ఇబ్బందులు పడుతున్న స్థానికులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద మురుగు ప్రవహించకుండా చెట్ల పొదలతో మూసుకపోయిన ఓపెన్ నాలా

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు ముందుకు సాగడం లేదు. అమృత్-2 పథ కం కింద మిర్యాలగూడ అండర్‌గ్రౌండ్ పనులకు నిధులు మంజూరయ్యాయి. దీంతో పట్టణంలో ము రుగు నీరు కనుమరుగవుతుందని భావించినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంతో ఒకడుగు ముందుకు మూడడుగులు వెనక్కి అన్న చందంగా తయారైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 18 ఏళ్ల క్రితం ప్రారంభమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులు నిధులు లేక అరకొర నిధులతో ఏడాది పనిచేస్తే మరో రెండుమూడేళ్ల కాలం వాటిని పట్టించుకోకపోవడంతో చేసిన కోట్లు వెచ్చించి చేసిన పనులు కూడా పనికిరాకుండా పోతున్నాయి.

నిధులు లేక..

మిర్యాలగూడ మునిసిపాలిటీలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి 2007లో రూ.45.51 కోట్లు మంజూరు కావడంతో రాంకీ సంస్థ పనుల నిర్మాణ బాధ్యత చేపట్టింది. ప్రతిపాదిత నిధులు సరిపోవడం లేదని సదరు సంస్థ పనులను మధ్యలోనే వదిలివేయడంతో మరో సంస్థకు పనులను అప్పగించారు. 2014లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రెండోసారి టెండర్లు పిలువగా కృషి ఇన్‌ఫ్రా టెండర్‌ను దక్కించుకుంది. రూ.33.1 కోట్ల పనులకు ప్రభుత్వం అనుమతించినప్పటికీ బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడంతో పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. కాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప నులు నత్తనడకన కొనసాగుతూ వచ్చాయి. ఏళ్ల తరబడి పనులు కొనసాగడం వల్ల మొదట ఏర్పాటు చేసిన పైపులైన్లలో బురద, చెత్త పేరుకపోయి మరమ్మతులు చేయడానికి వీలులేనంతగా పాడయ్యాయి.

అమృత్-2 లో రూ. 173.07 కోట్లు

మిర్యాలగూడ మునిసిపాలిటీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు అమృత్-2 పథ కానికి రూ. 173.07 కోట్లు మంజూరు చేసింది. గతంలో చేసిన పనులను అనుసంధానం చేసుకుంటూ నూతనంగా పైపులైన్లు, చాంబర్‌లు, లింకులు, ఎస్‌టీపీల నిర్మాణ పనులు చేపట్టారు. 26 కిలోమీటర్ల పూడిన పాత పైపులైన్లు, 14,000 జంక్షన్లు, 91 కి.మీ పైప్‌లైన్ క్లీనింగ్, 2300 మ్యాన్‌హోల్స్ మరమ్మతుల పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు 110 కి.మీ కొత్త పైపులైన్ నిర్మాణం, 4,400 మ్యాన్‌హోల్స్,18,333 జంక్షన్ చాంబర్స్, వాటర్ సీవరేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి 2024 ఏప్రిల్ నుంచి రెండేళ్ల కాలంలో పట్టణ ప్రజ లకు మురుగు కష్టాలు తొలగించేందుకు యూజీడి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు.

10 శాతం పూర్తి కాని పనులు

రెండేళ్ల కాలంలో పనులు పూర్తి చేయాలని సూచించినప్పటికీ ఏడాది గడిచినా కాంట్రాక్టరు 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు.లింక్ కాల్వలు, కొత్త లైన్‌లు 26 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1.65 కిలోమీటర్ల మాత్ర మే నిర్మించారు.110 కి.మీ సీవర్ లైన్‌కు 19.13 కి.మీ నిర్మాణం జరిపారు. 5440 మ్యాన్‌హోల్స్ నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 655 నిర్మాణాలు పూర్తి చేశారు. మరమ్మతులు. 91.20 కి.మీ మెయిన్‌టెయిన్స్ వర్క్ పైపులైనుకు 16.41 కి.మీ మాత్రమే పూర్తయిందని 11.50, 5.45 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు ఎస్టీపీలు నిర్మాణంలో పురోగతి లేదని అధికారులు అంటున్నారు. 2 ఏళ్లలో పనులు పూర్తి చేసే విధంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ సప్లయ్ నిర్మాణ పనులను దక్కించుకున్న కేఎస్ఆర్ సంస్థ నిర్మాణ పనులను పూర్తి చేయడంలో తీవ్రజాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు

మిర్యాలగూడ పట్టణంలో చేపట్టినఅండర్ గ్రౌండ్‌డ్రైనేజీ త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సంబంధి కాంట్రాక్టర్‌తో మాట్లాడి జాప్యం కావడానికికారణాలను తెలుసుకుంటాం.

- కందుకూరి వెంకటేశ్వర్లు,పబ్లిక్ హెల్త్ ఎస్ఈ

వాటర్ సప్లయ్ పనుల్లోనూ జాప్యం

అమృత్-2 కింద మిర్యాలగూడ మునిసిపాలిటీ నీటి సరఫరాకు రూ.93.40 కోట్లు మంజూరు చేశారు. దీనిలో కేంద్ర ప్రభుత్వ వాటా 28.83 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 53.08 కోట్లు, అర్బన్ లోకల్ బాడి రూ.6.90 కోట్లు, 15వ ఫైనాన్స్ నుంచి 4.59 కోట్లు నిధులు చెల్లించే విధంగా ఏర్పాట్లు చేశారు. కాగా ఇందుకోసం పట్టణంలో నిర్మించాల్సిన వాటర్ ట్యాంకుల్లో కొన్ని గ్రౌండ్ లెవల్ కూడా పూర్తి కాకపోవడం మరికొన్నింటికి స్థల సేకరణ కూడా చేయకపోవడంతో పనులు సకాలంలో పూర్తయే అవకాశం లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికా రులు చొరవ తీసుకుని సకాలంలో పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనుల్లో పురోగతి లేకుంటే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో పురోగతి లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం వాటర్ సప్లయ్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులపై పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లుతో కలిసి మునిసిపల్, నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిధులు లేక పనులు సాగక యూజీడీ అస్త వ్యస్తంగా తయారైందని ప్రస్తుతం నిధులు మంజూరైన పనులు చేయకపోవడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. కొన్ని చోట్ల వాటర్ ట్యాంకుల నిర్మాణానికి స్థలం ఇవ్వలేదని, మరి కొన్ని చోట్ల 2 మీటర్లు అనుకుంటే 6-8 మీ లోతు తవ్వి బెడ్లు పర చాల్సి వస్తుందని ప్రాజెక్టు సంస్థ అధికారులు ఎమ్మెల్యే దృష్టి తీసుకురాగా ఎన్ఎస్పీ ఈఈతో మాట్లాడి కలెక్టర్ ఆదేశానుసారం వాటర్‌ట్యాంకు నిర్మాణానికి స్థలం ఇవ్వాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో పార్క్ స్థలం నిరుపయోగంగా ఉందని అక్కడ ట్యాంక్‌నిర్మాణం చేపట్టేలా చూడాలని అన్నారు. మరో రెండు నెలల్లో పనుల్లో పురోగతి లేకుంటే తగిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. మునిసిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టలన్నారు. 9666290488 నెంబర్‌తో మున్సిపల్ అధికారులు వాట్సప్‌గ్రూపు ఏర్పాటు చేస్తారని, కాలనీల్లో, కూడళ్లలో చెత్తపోగు కనిపించే పౌరులు తమ బాధ్యతగా ఫొటో తీసి గ్రూపులో పోస్ చేసి ఏరియాను తెలియజేయాలన్నారు. కిరాయి ఇండ్లలో నివసించేవారికి ఆకస్మాతుగా కుటుంబ సభ్యులు మరణిస్తే దినకార్యాలు చేస కోవడానికి వీలుగా హిందూ శ్మశాన వాటికలో ఏర్పాట్లు చేసేలా చూడాలని డీఈని ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ పబ్లిక్ హెల్త్ డిఈ మనోరమ, మునిసిపల్ డీఈ వెంకన్న, కేఎస్ఆర్ ప్రాజెక్టు మేనేజర్ చెన్నూరి బాపూజీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రాజెక్టు డిజైనర్ సురేష్‌కుమార్, పబ్లిక్ మెల్త్ డిప్యూటీ కంట్రోలర్ రోహిత్, పబ్లిక్ హెల్త్ ఏఈ సాయితేజ, పబ్లిక్ హెల్త్ డిజైనర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ సత్యం

నిడమనూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన గోశెట్టి జ్యోతీకోటయ్యకు సీఎం సహాయ నిధి నుంచి రూ.40 వేల మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు మంగళవారం మార్కెట్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంల నాయకులు ముంగి శివమారయ్య, నర్సింగు విజయ్‌కుమార్, ఆలంపల్లి మైసయ్య, ఆలంపల్లి కృష్ణ, కోట్ల సైదులు, కంచి రవి, జానిపాషా, పగిళ్ల సైదులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట మాంసం విక్రయాలు

▶▶ వ్యాధుల బారిన పడిన జీవాల మాంసం అమ్మకం ▶▶ కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కొండమల్లేపల్లిలో రోడ్ల పక్కన చేపల విక్రయాలు

(ఆంధ్రజ్యోతి కొండమల్లేపల్లి)

మండల కేంద్రంలో జాతీయ రహదారి కోదాడ-జడ్చర్ల, నల్లగొండ రోడ్డులో రోడ్ల వెంట మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. నిబంధనలు అమలు చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొనుగోలుదారులకు నాణ్యమైన మాంసం లభించడం లేదు. గతంలో పండుగ శుభకార్యాలయాల్లో మాత్రమే మాంసాహారం తినే వారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఏ రోజు తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు మాంస కొనుగోలు చేసి తింటున్నారు. దీంతో మాంసం విక్రయం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో మండల కేంద్రంలో మాంసం మార్కెట్లు రోడ్ల వెంట మురుగు కాల్వల పక్కన బహిరంగంగా విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో దు మ్ము, ధూళితో పాటు దుర్వాసన వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. దీనికి తోడు మాంసం తూకంలో మోసం జరుగుతున్నాయని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ఎన్ని మాంసం విక్రయశాలలు ఉన్నాయి. వాటికి అనుమతులు ఉన్నాయా లేవా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని అధికారులు పర్యవేక్షణ కరువైంది. కొన్ని చోట్ల వ్యాధుల బారిన పడిన గొర్రెల, మేకలను వధిస్తూ మరికొందరు మాంసాన్ని రిఫ్రిజిరేటర్లలో రోజుల తరబడి నిల్వ ఉంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైన ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

చేపల మార్కెట్ లేక

చేపల మార్కెట్ యార్డు కూడా లేకపోవడంతో వ్యాపారులు అక్కంపల్లి, దుగ్యాల, వైజాక్ కాలనీ, వివిధ చెరువుల్లో పట్టిన చేపలను కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారులపై చేపలు కోసి విక్రయిస్తున్నారు. దీంతో రోడ్ల వెంట వెళ్లే వాహనాల దుము, ధూళితో కలుషితమై అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని పలువురు ఆరోపిస్తున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలి కావడంతో అందరికి అనుగుణంగా ఉండడం వల్ల మండల పరిధిలోని ప్రజలు మరి చుట్టు పక్కల ఉండే మండలాల నుంచి కూడా ఇక్కడి నుంచి మా సంవిక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. అలాగే ప్రతి ఆదివారం పశువుల సంత జరుగుతుండంతో చుట్టు పక్కల మండలాల నుంచి కూడా ప్రజలు నిత్యావసర సరుకుల కోసం వస్తుంటారు. దీంతో మాంసం అమ్మకం విక్రయాలు అధికంగా జరుగుతుంటాయి. మాంసం విక్రయాలు వ్యాధుల బారిన పడిన గొర్రెలు, మేకలను ఎలాంటి పరీక్షలు లేకుండా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక చౌరస్తాలో మాంసం విక్రయించే కొంత మంది వ్యాపారులు దాదాపు 3 నుంచి 4 రోజుల పాటు ఫ్రీజ్‌లో పెట్టి అమ్ముతున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు మాంసం దుకాణాలపై దాడులు నిర్వహించి వ్యాధి సోకిన మేకలు, గొర్రెల మాంసం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాంసం కొనాలంటేనే భయమేస్తోంది



కొండమల్లేపల్లిలో మాంసం దుకాణాల్లో మాంసం కొనాలంటే భయమేస్తోంది. రోడ్డు పక్కనే విక్రయించడంతో వాహనాల దుమ్ము, ధూళి చేరుతోంది. అంతేకాకుండా చుట్టు పక్కల గ్రామాల్లో కొందరు రైతుల నుంచి రోగాల బారిన పడిన గొర్రెలు, మేకలను మాంసం విక్రయదారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు మాంసం దుకాణాలను పరిశీలించి మాంసం మార్కెట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. -చాపల విష్ణు, కొండమల్లేపల్లి

నిబంధనలు పాటించాలి



మాంసం విక్రయదారులు సంబంధిత అధికారులతో పరీక్షలు చేయించుకున్నాకే మాంసాన్ని విక్రయించాలి. వ్యాధుల బారిన పడిన మేకలు, గొర్రెల మాంసాన్ని విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇదే విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాంసం దుకాణ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

డాకునాయక్, గ్రామ కార్యదర్శి, కొండమల్లేపల్లి

కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధీరావత్‌తండా పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌పై దుర్భాషలాడి దాడి చేసిన వ్యక్తిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు కోరారు. మంగళవారం పట్టణంలోని సబ్ కలెక్టర్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం పరిశీలన అధికారి ఇరిగేషన్ ఏఈ రామకృష్ణకు సాయంగా పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్ వెళ్లారు. పరిశీలన అంశంలో ఎలాంటి సంబంధం లేని పంచాయతీ కార్యదర్శిపై అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు పానుగోతు నాగరాజు తాను చెప్పిన పేర్లు ఎందుకు లిస్టులో నమోదు చేయలేదని దుర్భాషలాడి దాడి చేశారన్నారు.నాగరాజుపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సర్వేను పూర్తిగా విచారణ అధికారికి కేటాయించి సర్వే సమయాన్ని సాయంత్రం వేళల్లో కాకుండా ఉదయం వేళల్లో చేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నూకల రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, భద్రయ్య, కోడిరెక్క శైలజ, బంటు మహేష్, రమణ, రవికిరణ్, జగదీష్ పాల్గొన్నారు.

దాడికి పంచాయతీ కార్యదర్శుల ఖండన

కొండమల్లేపల్లి : మిర్యాలగూడ మండలంలోని ధీరావత్‌తండాలో విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై తండాకు చెందిన కొందరు దాడి చేయడాన్ని కొండమల్లేపల్లి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఖండించింది. ఈ మేరకు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ కార్యదర్శుల డివిజన్ అధ్యక్షుడు జైహింద్, శిరీష, శంకరయ్య, అనిత, రఘు, ప్రవీణ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేర్లు చేర్చలేదని దాడి చేశాడు



ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన ఓ నాయకుడు తాను చెప్పిన పేర్లు ఎందుకు అర్హుల జాబితాలో చేర్చలేదని నన్ను దుర్భాషలాడి దాడి చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పథకాల్లో అర్హులను గుర్తించేందుకు సర్వే చేస్తుంటే నాయకుల నుంచి తమకు ఒత్తిళ్ల, బెదిరింపులు వస్తున్నాయి. దాడికి పాల్పడిన వ్యక్తిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇక మీదట ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

- కోల సాయికుమార్ , పంచాయతీ, కార్యదర్శి ధీరావత్‌తండా

ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి

ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ తాము ప్రభుత్వ పథకాల్లో అర్హులను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే చేపడుతున్నాం. అయితే ఇటీవల కాలంలో గ్రామాల్లో నాయకులు జోక్యం చేసుకొని తాము చెప్పిన పేర్లే జాబితాలో ఉండాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. తమ పని తాము చేసుకోనివ్వకుండా అడ్డుపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పం దించి ప్రభుత్వ పథకాల అమలులో అడ్డుపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

-పూసపాటి నరేష్
(టీపీఎస్ఎఫ్ జనరల్ సెక్రటరీ)

మురుగు కాల్వల నిర్మాణానికి మోక్షమెప్పుడో ..!

● మాల్‌లో వ్యాపారసముదాయల్లోకి వెళ్తున్న వర్షపునీరు ● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని అధికారులు



కాల్వలో పేరుకు పోయిన మురుగు

(ఆంధ్రజ్యోతి- చింతపల్లి):

మండలంలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో రెండు ప్రధాన మురికి కాల్వల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో వర్షం వచ్చినప్పుడు వ్యాపార సముదాయాల్లోకి మురుగు, వర్షపు నీరు ప్రవహిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో వేంకటేశ్వరనగర్(మాల్)లోనిసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు ము రుగు కాల్వల నిర్మాణం కోసం రూ. 2 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం పాత మాల్ మార్కెట్ హైవే నుంచి చింతపల్లి మండలం గొడుకొండ్ల(వెంకటేశ్వరనగర్) వరకు సుమారుగా 4 కిలోమీటర్ల దూరంలో కాల్వల నిర్మాణ పనులు చేపట్టాలి. ఇందులో 2 కిలోమీటర్ల మేరా పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. పనులు ని ర్వహించే ముందు గుత్తేదారు నత్తనడకగా చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేవు. గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కాల్వల పనులు చేపట్టలేదు. దీంతో పాటు వ్యాపారస్థులు తమ వ్యర్థాలను కాల్వల్లో వేయడం ద్వారా మురుగు నీరు నెలలతరబడి నిల్వ ఉంటుంది. ఈగలు, దోమలు ప్రబలి రోగాల బారిన పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకోని కాల్వల నిర్మాణ పనులకు టేండర్ ప్రక్రియ ప్రారంభించి పనులు సత్వరమే పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్

నివేదిక పంపా



కాల్వల నిర్మాణ పనులకు సంబంధించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపా. త్వరలో టెండర్ ప్రక్రియ ఏర్పాటు చేసి పనులు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

-జీవన్‌సింగ్, పీఆర్‌డీఈ(చింతపల్లి)



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నర్సింహులు, కళాజాతర బృందం

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

పెద్దఅడిశర్లపల్లి,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. నల్లగొండ పోలీసు కళాజాతర ఆధ్వర్యంలో మంగళవారం గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమా దాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అతి వేగం, ఓవర్ లోడ్, అజాగ్రతతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో కళాజాతర బృందం జమీందార్ రాజు, రైటర్ యాదగిరి, కానిస్టేబుల్స్ అట్టినాయక్, ఆనంద్, శివ, శ్రీను, దశరథ, లింగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

దామరచర్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో భాగంగా మే 4న మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ క్యాంపులో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పథకాల ప్రచారంపై పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ మే 4న మిర్యాలగూడ పట్టణంలో ప్రముఖ సింగర్ మంగ్లీ బృందంతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బెజ్జం సాయి, బంటు కిరణ్, అన్నెం కరుణాకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, గోవిందరెడ్డి, గాలి సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదారావు పాల్గొన్నారు.



పోస్టరను ఆవిష్కరిస్తున్న గాజుల శ్రీనివాస్, తదితరులు